ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025 | 12 పేజీలు

తిరుపతి



తుడా 29వ ఛైర్మన్‌గా...

నేడు 'డాలర్స్' ప్రమాణ స్వీకారం

విజయవాడ-బెంగళూరుకు వయా తిరుపతి 'వందే భారత్'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ నుంచి మరో వందేభారత్ రైలు రానుంది. ఇప్పటికే విజయవాడ నుంచి చెన్నైకి వందేభారత్ సర్వీసు కొనసాగుతోంది. తాజాగా విజయవాడ నుంచి తిరుపతి మీదుగా బెంగళూరుకు కొత్తగా వందేభారత్ ప్రారంభం కానుంది. దీని ద్వారా నాలుగున్నర గంటల్లోనే విజయవాడ టు తిరుపతి చేరుకోవచ్చు. ఈ రైలు రూట్, టైమింగ్స్ ఖరారు చేశారు. త్వరలోనే ప్రారంభం కానుంది.

విజయవాడ–బెంగళూరు మధ్య వందే భారత్ ట్రైన్ నడిపేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కేవలం తొమ్మిది గంటల్లోనే విజయవాడ నుంచి బెంగళూరుకు చేరుకోవచ్చు. ఇది స్టార్ట్ అయితే దాదాపు 3 గంటల ప్రయాణ సమయం ఆదా కానుంది. ఈ వందే భారత్ ట్రైన్ బెంగళూరు వెళ్లే వారితో పాటు తిరుపతి వెళ్లే భక్తులకూ ఉపయోగపడనుంది. మొత్తం 8 బోగీల్లో ఏడు ఏసీ చైర్‌కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్‌కార్ ఉండనున్నాయి. ఈ వందే భారత్ ట్రైన్ మంగళవారం మినహా వారానికి 6 రోజుల పాటు నడవనుంది. కొత్తగా రాబోయే ఈ ట్రైన్ (20711) విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి తెనాలి 5.39, ఒంగోలు 6.28, నెల్లూరు 7.43, తిరుపతి 9.45, చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరుకి 14.15 గంటలకు చేరుతుంది.

నాలుగున్నర గంటల్లో తిరుపతికి

ఈ రైలు మార్గం.. టైమింగ్స్ మేరకు కేవలం నాలుగున్నర గంటల్లోనే విజయవాడ నుంచి తిరుపతికి చేరుకోవచ్చు. అదే విధంగా తిరుగు ప్రయాణంలో అదే రోజు ఈ ట్రైన్ (20712) బెంగళూరులో మధ్యాహ్నం 2.45 గంటలకు స్టార్ట్ అయి, కృష్ణరాజపురం 2.58, కాట్పాడి సాయంత్రం 5.23, చిత్తూరు 5.49, తిరుపతి 6.55, నెల్లూరు 8.18, ఒంగోలు 9.29, తెనాలి 10.42, విజయవాడకు 11.45 గంటలకు చేరుకుంటుంది. ప్రస్తుతం విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లే వారికి వారానికి మూడు రోజులు మాత్రమే నడిచే మచిలీపట్నం నుంచి యశ్వంతపూర్ వెళ్లే కొండవీడు ఎక్స్‌ప్రెస్ మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంది. త్వరలో రాబోయే వందే భారత్ ట్రైన్‌తో తక్కువ సమయంలోనే గమ్యస్థానాలను చేరుకోవడంతో పాటు, ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి.

ఏపీకి వందేభారత్ స్లీపర్

ఏపీ నుంచి వందేభారత్ స్లీపర్ కేటాయించేలా ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. విజయవాడ నుంచి అయోధ్య, వారణాసి వరకు కొత్తగా సర్వీసు ప్రారంభించాలని భావిస్తున్నారు. వందేభారత్ తొలి విడత కేటాయింపుల్లోనే ఈ రైలు అందుబాటులోకి రానుంది. ఇక.. రాబోయే రెండు, మూడేళ్లలో దేశంలో 200 కొత్త వందేభారత్ ట్రైన్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో చైర్‌కార్‌తో పాటు స్లీపర్ ట్రైన్లు కూడా ఉండనున్నాయి. అదే విధంగా 100 అమృత్ భారత్, 50 నమో భారత్ ర్యాపిడ్ రైళ్లు, 17 వేల 500 జనరల్ నాన్ ఏసీ కోచ్‌లు రాబోతున్నాయి. కొత్త అమృత్ భారత్ రైళ్ల ద్వారా తక్కువ దూరం ఉన్న నగరాలకు కనెక్టివిటీ మరింతగా పెరుగుతుంది.

నాలుగున్నర గంటల్లో తిరుపతికి..

టిటిడి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా కెవి మురళీకృష్ణ

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్‌గా కెవి మురళీకృష్ణను నియమించారు. తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అదనపు బాధ్యతల స్థానంలో కెవి మురళీకృష్ణనునియమిస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. మురళీకృష్ణ ప్రస్తుతం 16వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్నారు.

ఎమ్మెల్యే నానికి చెక్కు అందిస్తున్న దాతలు

చంద్రగిరి గోవింద ధామానికి విరాళం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) చంద్రగిరిలో నూతనంగా నిర్మిస్తున్న గోవింద ధామానికి రెడ్డివారిపల్లి సర్పంచ్ రేవతి ప్రకాశ్ రెడ్డి రూ.1,00,116 విరాళం ప్రకటిస్తూ దానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే పులివర్తి నానికి అందజేసారు. గోవిందధామం నిర్మాణంలో రెడ్డివారిపల్లి పంచాయతీ నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచ్ రేవతి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. విరాళం ప్రకటించిన దాతకు పులివర్తి నాని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చంద్రగిరి మండల టిడిపి అధ్యక్షుడిగా బాలకృష్ణమూర్తి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండల టిడిపి అధ్యక్షుడిగా అనంతగుర్రప్పగారిపల్లికి చెందిన బాలకృష్ణ మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన 2024 సార్వత్రిక ఎన్నికలలో టిడిపి విజయానికి కష్టపడి పని చేశారు. గతంలో బాలకృష్ణమూర్తి జూ పార్క్ డైరెక్టర్‌గా కూడా పని చేశారు.

మండల టిడిపి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు బాలకృష్ణ మూర్తికి ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలియజేశారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా...

ఈ.. అగ్గిపుల్లల ఫ్యాక్టరీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం గ్రామపంచాయతీలో 1983లో మంగళం క్వార్టర్స్ ఏర్పాటు చేస్తూ స్థానికంగా ఉన్న మహిళలకు, వికలాంగులకు, ప్రత్యేక ప్రతిభావంతులకు ఉపయుక్తంగా ఉండాలని వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడానికి కొన్ని నిర్మాణాలను చేశారు. అందులో అగ్గిపుల్లల ఫ్యాక్టరీ ఒకటి. నేడు ఈ అగ్గిపుల్లల ఫ్యాక్టరీ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అగ్గిపుల్లల ఫ్యాక్టరీ భవనం శిథిలావస్థకు చేరిందని, దీని స్థానంలో ప్రజా ప్రయోజనాల కోసం కొత్త భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ అగ్గిపుల్లల ఫ్యాక్టరీ భవనం తమదంటూ స్థానికంగా ఉన్న ప్రత్యేక ప్రతిభావంతుడు స్థానిక మహిళలతో తరచూ గొడవలకు దిగుతూ అసభ్యకర పదజాలంతో దూషణలకు దిగుతున్నాడని స్థానిక మహిళలు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులకు చెప్పినా, పోలీసులకు చెప్పిన పట్టించుకునే వారే కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్గిపుల్లల ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో స్థానికులు వారి అవసరాల కోసం బట్టలు ఆరవేసుకోవడానికి అక్కడ ఉన్న చెట్లకు దారం కట్టుకున్నా ఆ ప్రత్యేక ప్రతిభావంతుడుతో ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అగ్గిపుల్లల ఫ్యాక్టరీలో రాత్రిపూట యువకులు గుమికూడి మద్యం సేవించడం, మత్తు పదార్థాలను, గంజాయి సేవించడం చేస్తున్నారని అన్నారు. అప్పుడప్పుడు గొడవలు వేసుకుంటూ కొట్టుకొని రోడ్లపై పరిగెత్తుతున్నారని, దీంతో స్థానికంగా భయానక వాతావరణం ఏర్పడిందన్నారు. జిల్లా కలెక్టర్ అయిన అగ్గిపుల్లల ఫ్యాక్టరీ విషయమై స్పందించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని, అలానే ఈ ఫ్యాక్టరీ స్థానంలో ప్రజాప్రయోజనాల కోసం ఏదైనా నూతన భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరిన అగ్గిపుల్లల ఫ్యాక్టరీ దశాబ్దాలుగా ఇలానే...

నేడు తిరుపతిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: 20 తిరుపతి పరిధిలోని నార్త్ సెక్షన్ లో 33/11 కె.వి. అలిపిరి ఎస్.లో గల 33/11 కె.వి. రాముల వారి టెంపుల్ ఫీడర్ విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు కొట్టివేత పనులనుద్దేశించి ఈ రోజు ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01.00 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ.ఎస్పీ.డిసీయల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈ.ఈ. విన్న కోటిచంద్ర శేఖర్ రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున కె.బి. లేఔట్, సింగలగుంట , తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులందరు విద్యుత్ సరఫరాలో అంతరాయన్ని గమనించి సహకరించాలని కోరారు.

టిడిపి పట్టణ అధ్యక్షుడికి అభినందనలు

ప్రజాశక్తి - నాయుడుపేట

నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడుగా నియమితులైన నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం పట్టణంలోని షేక్ రఫీ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యదర్శి బిరదవాడ నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి నాన బాల సుబ్బారావు, టిడిపి నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నిత్య కృష్ణారెడ్డిలు రఫీని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు

టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ రఫీని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

నేడు తిరుమలలో హనుమజ్జయంతి వేడుకలు

ప్రజాశక్తి - తిరుమల ప్రతి సంవత్సరం వైశాఖ మాసం బహుళదశమినాడు తిరుమల క్షేత్రంలో ఘనంగా నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలు ఈ ఏడాది మే 22వ తారీఖున టీటీడీ అత్యంత వైభవంగా నిర్వహించనుంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి, కాలినడకబాటలో ఏడవ మైలు వద్ద ఉన్న శ్రీప్రసన్న ఆంజనేయస్వామి వారికి హనుమజ్జయంతినాడు ప్రత్యేక పూజలు జరుగనుంది. తిరుమలలోని జాపాలి తీర్థంలో కూడా హనుమజ్జయంతి ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా సాంప్రదాయానుసారం టీటీడీ తరపున శ్రీ జపాలి హనుమాన్ కు పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు టీటీడీ భక్తులు, స్థానికుల సౌకర్యార్థం ఉచిత రవాణా సౌకర్యాన్ని తిరుమల నుండి ఏడో మైలుకు, తిరిగి తిరుమల చేరడానికి కూడా కల్పిస్తున్నది.

ప్రజాశక్తి

బుధవారం 21 మే 2025



తుడా 29వ చైర్మన్‌గా...

నేడు 'డాలర్స్' ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తుడాకు 29వ చైర్మన్‌గా డాలర్స్ సి.దివాకర్‌రెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తుడా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకూ ఎక్కువగా అధికారుల పాలనే సాగింది. చైర్మన్లుగా ఉన్నవారు ఎంఎల్‌ఎలుగా పోటీచేసి గెలుపొందిన వారూ ఉన్నారు. ఇప్పటివరకూ 15 మంది రాజకీయ నేతలు చైర్మన్లుగా పనిచేశారు. ఇందులో మాజీ ఎంఎల్‌ఎలు వెంకటరమణ, భూమన కరుణాకర్‌రెడ్డి, సత్రవాడ మునిరామయ్య, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎ.మోహన్, రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డి ఎంఎల్‌ఎలుగా ఉన్న జాబితాలో ఉన్నారు. కోలా రాము, ఎల్‌బి ప్రభాకర్, కందాటి శంకర్‌రెడ్డిలు ఎంఎల్‌ఎలుగా పోటీచేసి ఓటమిని చవి చూసిన జాబితాలో ఉన్నారు.

డాలర్స్ దివాకర్‌రెడ్డి 29వ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. తుడా చైర్మన్ కావడంతో 2029 ఎన్నికల్లో ఆయనకే ఎంఎల్‌ఎగా అవకాశం ఇస్తారన్న చర్చనూ ఆయన అనుచరగణం లేవనెత్తడం గమనార్హం. డాలర్స్ దివాకర్‌రెడ్డి తుడా చైర్మన్‌గా పూర్తి న్యాయం చేస్తానని 'ప్రజాశక్తి'కి వెల్లడించారు.

బాధ్యతలు చేపట్టిన చైర్మన్ల జాబితా

1. వి.వెంకటమునిచెట్టి (1982-83)
2. ఎం.వెంకట రామనాయుడు (1984-85)
3. ఎ.మోహన్ (1986-87)
4. కెఆర్ పరమహంస, ఐఎఎస్ 1987
5. సెబాస్టియన్ రాజు 1988
6. ఎస్.మునిరామయ్య 1988-89
7. కోలా రాము 1989-90
8. బి.వెంకటరామయ్య, ఐఎఎస్ 1992
9. డాక్టర్ ఆర్.రాజశేఖర్‌రెడ్డి 1992-94
10. ఎల్‌బి ప్రభాకర్ 1995
11. ఎన్.నరసింగ్‌రావు, ఐఎఎస్ 1996
12. నీరబ్‌కుమార్ ప్రసాద్, ఐఎఎస్ 1998
13. కె.శంకర్‌రెడ్డి 1998-99
14. పి.కృష్ణయ్య, ఐఎఎస్ 2000
15. పివి సత్యనారాయణమూర్తి, ఐఎఎస్ 2001
16. ఎన్‌వి ప్రసాద్ 2003-04
17. బి.కరుణాకర్‌రెడ్డి 2004-06
18. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 2007-10
19. వి.శేషాద్రి, ఐఎఎస్ 2010
20. ఎస్.సాల్మన్ ఆరోక్యరాజ్, ఐఎఎస్ 2011
21. కె.రాంగోపాల్, ఐఎఎస్ 2013
22. ఎం.వెంకటరమణ 2014
23. సిద్దార్థజైన్, ఐఎఎస్ 2014
24. వి.గిరిధర్, ఐఎఎస్ 2015
25. కరికల్ వాలవెన్ 2015
26. జి.నరసింహయాదవ్ 2017
27. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 2023
28. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి 2024
29. డాక్టర్ సి.డాలర్స్ దివాకర్‌రెడ్డి 2025

తుడా ఛాంబర్ ముస్తాబు

హాథీరాంజీ.. నీ భూమి 'స్వాహా'జీ..

గ'లీజ్' స్కెచ్

- రూ.200కోట్ల విలువైన భూమి కబ్జాకు యత్నం
- 'కరస్పాండెంట్' తానే అంటూ పసుపు 'ముసుగు'
- ప్రభుత్వ పెద్దల నుంచి అధికారులకు ఒత్తిళ్లు
- కలెక్టర్ విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి..

లీజుదారు తానేనంటూ మఠం భూమి స్వాహా చేసే యత్నం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎంతో ఘన చరిత్ర గలిగిన శ్రీ స్వామి హథీరాంజీ మఠం భూములపై కూటమి ప్రభుత్వంలో నీలి నీడలు అలముకుంటున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్ల విలువైన భూములు కలిగిన ఈ మఠానికి సంబంధించి దశాబ్దాల కాలంగా వందల ఎకరాల భూములు ధారాదత్తమైపోయాయి. రాజకీయ నాయకుల కనుసన్నల్లో మఠం మహంతులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులపై తీవ్రమైన ఒత్తిళ్లు తీసుకువచ్చి తమవారికి కట్టబెట్టే ప్రయత్నాలు జరిగిపోతూనే ఉన్నాయి. శ్రీ స్వామి హథీరాం బావాజీపై ఉన్న భక్తితో ఎంతోమంది భక్తులు దానధర్మాలుగా ఇచ్చిన భూములు నేడు రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో కనుమరుగవుతున్న పరిస్థితి. గడిచిన కాలంలో అనేక ఎకరాలకు సంబంధించిన భూములు లీజు పేరుతో మఠం అధికారుల నుండి పొందడం ఆపై కోర్టులలో భూములకు సంబంధించి కేసులు వేయడం.. ఇలా కొన్నేళ్లు గడిచాక ఆ భూములపై సర్వహక్కులు పొందడం పరిపాటిగా మారిపోయింది. తిరుపతి పట్టణ సర్వే నంబర్ 942లోని ఎ2.07 సెంట్లు ఉన్న శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన ఓ భూమిని దక్కించుకోవడానికి ఓ రాజకీయ నాయకుడు వేసిన భారీ స్కెచ్ పై 'ప్రజాశక్తి' ప్రత్యేక కథనం. అసలు 'లీజుదారు ఎవరు?' అన్నది విచారణ జరిగితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

మఠం భూమి లీజు కోసం...(జరిగిన కథ)

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేయాలనే లక్ష్యంతో శ్రీ స్వామి హథీరాంజీ మఠంకు చెందిన భూమిని లీజు ద్వారా పొందేందుకు సి. బందాప్రసాద్ అనే మహిళ 1991 అక్టోబర్ మాసంలో మూడేళ్ల లీజు ప్రతిపాదికన నెలకు రూ.1550 అద్దె, ప్రతి సంవత్సరం 10 శాతం అద్దె పెంచుకునేలా చేసిన నిర్ణయం మేరకు తిరుపతి నగర పరిధి పట్టణ సర్వే నంబర్ 942లోని ఎ2.07 సెంట్లు భూమిని పొందారు. లీజు ద్వారా పొందిన మఠం స్థలంలో శ్రీ విద్యోదయ ఎడ్యుకేషనల్ సొసైటీని(మహిళల కోసం మహిళల ద్వారా) స్థాపించి పాఠశాల నిర్వహణకు అవసరమైన గదుల నిర్మాణం, ఫర్నిచర్ ఇతర మౌలిక వసతులను లీజుదారు తన సొంత డబ్బులతో ఏర్పాటు చేసుకున్నారు. 1996లో మరో పదేళ్లపాటు లీజుదారు ఆర్డర్ తెచ్చుకున్నారు. అటు తర్వాత వయసు మీద పడటంతో ఆరోగ్యం సహకరించక లీజుదారు బందాప్రసాద్ 2015 వరకు శ్రీ విద్యోదయ ఎడ్యుకేషనల్ సొసైటీకి తన కుమార్తె సరోజినీ ప్రసాద్ ను

4 లో

కార్మికుల గొంతుకోసే..

4లో

నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలి

తిరుపతి పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లాఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు



ఒక్కరోజు పర్యటనలో భాగంగా కుప్పంకు రానున్న సిఎం

నేడు కుప్పంకు చంద్రబాబు

గంగమ్మకు పట్టు వస్త్రం సమర్పణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక రోజు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం కుప్పం రానున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి బుధవారం మద్యాహ్నం బెంగళూరు విమానాశ్రయం నుండి హెలికాప్టర్ ద్వారా బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు గుడిపల్లి మండలం ద్రవిడ యూనివర్సిటీ చేరుకుంటారు. 12.50 గంటలకు కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ దేవస్థానం చేరుకుని జాతర వేడుకలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1.40 గంటలకు ద్రవిడ యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుని 2.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బెంగళూరు విమానాశ్రయం తిరుగు ప్రయాణం అవుతారని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో తెలిపారు.

తుడా పరిధిలో కొత్త లేఔట్లు : ఎన్.మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని సూళ్లూరు పేట, నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో కొత్తగా లేఅవుట్లు ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలిస్తున్నామని తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అన్నారు. మంగళవారం తుడా అధికారులతో కలసి నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో లేఅవుట్లు వేయడానికి అనువైన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా తుడా పరిధిలో ప్రజలకు ఉపయోగకరంగా ఉండే భూములను గుర్తిస్తున్నామని అన్నారు. ఆ భూములు కొనుగోలు చేసి అందులో లేఅవుట్లు వేసి అభివృద్ధి చేస్తామని అన్నారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఉపాధ్యక్షులను కలిసి సూళ్లూరుపేట లోని పార్క్ ను, రోడ్లను అభివద్ధి చేయాలని కోరారు. తుడా పరిధిలో బడ్జెట్ పరిశీలించి అన్ని పనులు చేయిస్తామని అన్నారు. ఈ స్థల పరిశీలనలో తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్ కష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, సిపిఒ దేవికుమారి, ఎల్.ఏ.ఓ. సుజన, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తిరుపతి గంగమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి గంగమ్మ జాతర తరువాత ఐదు వారాలు మారు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఇందులో భాగంగా తొలి మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంతో పాటు గంగమ్మను టెంకాయలతో అలంకరణ చేసి నారికేళ గంగమ్మగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. పలువురు భక్తులు వివిధ రకాల వేషాలతో గంగమ్మను దర్శించుకున్నారు.

ఎన్‌సిసి శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి ఎన్‌సిసి నగర్‌లో 5వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్సిసిని సోమవారం 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ పది రోజుల పాటు శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అంజు వాద్వా ప్రారంభ ఉపన్యాసం చేశారు. వివిధ జిల్లాల నుంచి 500 మంది బాలికల శిక్షకులతో మాట్లాడుతూ ఈ క్యాంపులో ఫైరింగ్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, హెల్త్ అండ్ హైజినిక్ ఆప్టికల్స్ మొదలగు అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని అందరిలో క్రమశిక్షణ, దేశభక్తి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమాండర్ ఎన్సిసి ఆఫీసర్లు సుబేదార్ మేజర్ శర్మ, చీఫ్ ఆఫీసర్ భారతి పాల్గొన్నారు.



గ'లీజ్' స్కెచ్

3వ పేజీ తరువాయి..

కరస్పాండెంట్‌గా నామినేట్ చేస్తూ ఇదే విషయాన్ని అప్పటి మహంతుగా ఉన్న అర్జున్ దాస్ కు లేఖ ద్వారా తెలిపారు. 2015 మార్చిలో బందాప్రసాద్ మరణించారు. ఆమె మరణానంతరం కరస్పాండెంట్ గా బాధ్యతలు స్వీకరించిన సరోజినీ ప్రసాద్ 2016, జనవరి నెలలో శ్రీ స్వామి హథీరాంజీ మఠం ద్వారా లీజుగా పొందిన స్థలాన్ని తిరిగి అప్పజెప్పేందుకు మఠం అధికారులకు లేఖ రాశారు. పాఠశాల నిర్వహణ కష్ట సాధ్యం అవుతోందని, తాము లీజు ద్వారా పొందిన మఠం భూమిని మఠం అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. లీజు స్థలానికి సంబంధించి దాదాపు రూ.15 లక్షల రూపాయలకు పైగా బకాయి ఉందని, వాటిని చెల్లించాలని మఠం అధికారులు అప్పటి కరస్పాండెంట్ గా ఉన్న సరోజినీ ప్రసాద్ కు సూచించారు. ఇందుకోసం సరోజినీ ప్రసాద్ శ్రీ విద్యోదయ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటు కోసం తాము తమ సొంత నిధులతో పాఠశాల నిర్వహణలో భాగంగా నిర్మించిన గదులు, ఫర్నిచర్ ను లీజు స్థలానికి చెల్లించవలసిన అద్దెకు జమ చేసుకోవలసిందిగా మఠం అధికారులకు తెలిపారు.

మఠం అనుభవంలోకి...

అటు తర్వాత సదరు భూమిని మఠం స్వాధీన అనుభవంలోకి వచ్చింది. ఆ మధ్యకాలంలోనే ఇదే స్థలంలో లోక కళ్యాణార్థం హోమాధి కార్యక్రమాలను అర్జున్ దాస్ నేతత్వంలో దేశంలోని అనేక మఠాల నుండి మఠాధిపతులు, గురువులు హాజరై మూడు రోజులపాటు వైభవోపేతంగా హోమ కార్యక్రమాలను నిర్వహించారు.

స్వాహాకు భారీ స్కెచ్

ఇప్పుడు ఈ భూమిని స్వాహా చేసేందుకు కొటాల గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు భారీ స్కెచ్ వేసినట్లు విశ్వసనీయ సమాచారం. 2.07 ఎకరాల భూమిని లీజు ప్రాతిపదికన దక్కించుకునేందుకు వి.మదన్‌మోహన్ ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. తాను 1991లో లీజు ద్వారా సదరు భూమిని పొందానని, ఇన్నేళ్లుగా తాను ఏర్పాటు చేసుకున్న ఎడ్యుకేషనల్ సొసైటీలో ఫర్నిచర్, విలువైన డాక్యుమెంట్లు అపహరించారని సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి, కలెక్టర్ దృష్టికి ఫైల్ తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఇందుకుగాను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఓ అర్జీని సైతం ఇచ్చారు. మఠానికి సంబంధించిన పనికిరాని స్థలాన్ని తాను లీజుద్వారా పొందానని, అందులో ఫర్నిచర్ విలువైన వస్తువులను గుర్తు తెలియని వారు దొంగిలించుకు పోయారని, దీనిపై రూ.2 కోట్ల విలువైన నష్టం వాటిల్లిందని అర్జీలో పేర్కొనడం గమనార్హం. నష్టపరిహారాన్ని ప్రభుత్వం చెల్లించాలని, 1991లో అప్పటి లీజు ప్రైస్ రూ.1550 అమలు చేయాలని, ఎడ్యుకేషనల్ సొసైటీకి సంబంధించి ఆస్తులను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో మఠం అధికారులు తనకు స్థలాన్ని అప్పజెప్పారని, లోనికి వెళ్లి చూస్తే వస్తువులు దొంగిలించారని చెబుతున్నారు. శ్రీ విద్యోదయ ఎడ్యుకేషనల్ సొసైటీకి ఎటువంటి సంబంధం లేని ఈ రాజకీయ నాయకుడు మఠానికి సంబంధించిన ఈ స్థలాన్ని మూడు దశాబ్దాల పాటు లీజు ద్వారా అనుభవించేందుకు పెద్ద స్కెచ్ వేశారని విశ్వసనీయంగా తెలుస్తోంది. సరోజినీ ప్రసాద్ మఠానికి భూమిని తిరిగి అప్పగించేటపుడు అద్దె దాదాపు రూ.15 లక్షలు చెల్లించలేమని, ఫర్నిచర్‌ను అద్దెకు జమ చేసుకోవాలని మఠం అధికారులను ప్రాధేయపడ్డారు. అయితే ఇపుడు మదన్‌మోహన్ తానే కరస్పాండెంట్‌గా చెప్పుకుంటూ రెండు కోట్ల రూపాయల విలువైన ఫర్నిచర్, ఇతర వస్తువులు దొంగిలించారని ప్రభుత్వాన్ని నమ్మించే ప్రయత్నం చేయడం పొంతనలేని విషయం. సదరు భూమి విలువ రూ.200 కోట్లుగా మార్కెట్ ఉంది. ప్రభుత్వ పెద్దల సహకారంతో ఈ భూమి లీజును మసిపూసి మారేడుకాయ చేస్తూ దేవాదాయ ధర్మాదాయ, ఉన్నతాధికారుల సహకారంతో జరిగే ఈ కుట్రపై కలెక్టర్ విచారణకు ఆదేశిస్తే వాస్తవాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

వెంకటగిరిలో..


తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీలో..

నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

కార్మికుల గొంతుకోసే నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు, నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ కార్మికవర్గం నేడు అనుభవిస్తున్న చట్టాలన్నీ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్నవన్నారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ పేరుతో అతి తక్కువ జీతాలతో పనిచేయించడం వల్ల పని భద్రత లేకుండా పోయిందన్నారు. కార్మికవర్గం సమస్యలతో సతమతమవుతోందన్నారు. కార్మిక హక్కులకు రక్షణ లేకుండా అణచివేయాలని మోడీ ప్రభుత్వం చూస్తోందని, దోపిడీని తీవ్రతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను తెచ్చిందన్నారు. కోవిడ్ కాలంలో ప్రజలంతా ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని కర్ఫ్యూలో బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్న కాలంలో, చాపకింద నీరులా ఈ కోడ్లను పార్లమెంట్‌లో నామమాత్రపు చర్చ కూడా జరపకుండా బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకొచ్చిందన్నారు. ఈ బిల్లుకు కాంగ్రెస్, టిడిపి, వైసిపి పూర్తి మద్దతు ఇచ్చాయన్నారు. వామపక్షాలు, డిఎంకె మాత్రమే వ్యతిరేకించాయని తెలిపారు. సరళీకరణ విధానాల అమల్లో భాగమే లేబర్‌కోడ్‌లను కార్మికవర్గంపై రుద్దుతున్నారన్నారు. ఇపుడున్న పాత కార్మిక చట్టాలను మరింత పటిష్టం చేసి ఈ చట్టాలనే కొనసాగించాలని, ఉద్యోగ కార్మికులకు రక్షణ కల్పించాలని, చాలీచాలని జీతాలతో జీవనం గడుపుతున్న కార్మికవర్గానికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. బిజెపి ప్రభుత్వం తన వైఖరిని మార్చుకొని లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక వర్గానికి రక్షణ కల్పించాలని లేనిపక్షంలో జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఈ సమ్మెలో పాల్గొని ఈ ప్రభుత్వానికి హెచ్చరిక తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం మాధవ్, పి బుజ్జి, పి చిన్న, శ్రీరాములు, సిద్దు, బాబు ప్రసాద్, రాము, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

- **తిరుపతి రూరల్‌లో...** పేరూరు వద్ద ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీ వర్కర్స్ మంగళవారం నిరసన తెలిపారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ జిల్లా జేఏసి ఛైర్మన్ గండికోట నాగ వెంకటేష్ మాట్లాడుతూ దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను మోడీ ప్రభుత్వం ఒక్క కలం పోటుతో తూట్లు పొడుస్తోందన్నారు. కార్మిక హక్కులకు సంకెళ్లు వేసి, కార్పొరేట్ శక్తులకు కార్మికుల శ్రమను దోచి పెడుతోందన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మస్తానయ్య, మణెమ్మ, అలివేలు, ఈశ్వర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో ఆర్డీవోకు వినతి

- **వెంకటగిరిలో...** తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. సిఐటియు జిల్లా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికవర్గాన్ని కట్టుబానిసలుగా మార్చే లేబర్‌కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, రమణయ్య, రాజయ్య, చిరంజీవి, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

- **శ్రీకాళహస్తిలో...** కార్మికులకు కనీస వేతన చట్టాన్నిఅమలు చేయాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉపాధి పథకానికి బడ్జెట్లో నిధులు పెంచి ఏడాదికి రోజుకు రూ.600 వేతనం, 200 రోజుల పనిదినాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, వేణు, రాపూరు సుబ్రమణ్యం, గురునాథం, రాజా పాల్గొన్నారు. చిట్టత్తూరు సచివాలయం వద్ద చిట్టత్తూరు సిపిఎం కార్యదర్శి గురునాథం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు

పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 25వ తేదీ జరగనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 సంబంధించిన అన్ని ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పరీక్షల నిర్వహణపై డిఆర్ఓ నరసింహులు, సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ 25న నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ 2025 పరీక్షలకు తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు 13 సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, 5261 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షలను పకడ్బందీగా ఎటువంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని సూచించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయని తెలిపారు. (2 సెషన్స్) ఉదయం 9.30 నుండి ఉ 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 4.30 గంటల వరకు పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కగా ఉండాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలలోకి మొబైల్ ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వాచ్లు, వైర్లెస్ హెడ్ సెట్స్, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతి ఉండదని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ బందోబస్తు ఏర్పాటు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖల అధికారులు చూడాలన్నారు. తాగునీరు, టాయిలెట్స్ సక్రమంగా ఉండాలని, అభ్యర్థుల సౌకర్యార్థం సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టిసి వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అడిషనల్ ఎస్పీ, తిరుపతి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్, డిఎంఅండ్ హెచ్ఓ, డ్వామా పిడి జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయండి

కమిషనర్ ఎన్.మౌర్య

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన, రాజీవ్ గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీవకోన వంటి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఇంటింటి చెత్తసేకరణ పక్కగా చేయాలని, ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని అన్నారు. డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయాలని, చెత్త తొలగించడం, కాలువలు శుభ్రం చేయడం వంటివి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి, తదితరులు ఉన్నారు.

వినియోగదారుల రక్షణ

కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ బాధ్యత

ప్రజాశక్తి - క్యాంపస్: వినియోగదారుల రక్షణ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ బాధ్యత అని కౌన్సిల్ సభ్యుడు పి.అమర్నాథ్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా తిరుపతి రూరల్ మండలం పరిధిలోని తుమ్మలగుంటలో ప్రపంచ కొలతలు, తూనికల దినోత్సవం – 2025 పురస్కరించుకొని డిఎస్ఓ సంఘాల సభ్యులతో అవగాహన కార్యక్రమం తిరుపతి జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్, పరివర్తన సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పి.అమర్నాథ్ మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు తమ కుటుంబ అవసరాల కోసం కొనుగోలు చేసే ప్రతి వస్తువులను నాణ్యత, పరిమాణం, వస్తువులను వాడకం గడువు తేదీ, సంవత్సరము తప్పనిసరిగా పరిశీలించి తర్వాతనే కొనుగోలు చేయాలని మహిళలకు సూచించారు. డిఎస్ఓ సంఘాల సభ్యులు, పిల్లలు, యువత పేపర్లు,సెల్ ఫోన్లు, కరపత్రాలు, ఇతర ప్రసారమాధ్యమాల ద్వారా వినియోగదాల చట్టాలు హక్కుల పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు మండల స్థాయిలో డిప్యూటీ తహసీల్దారును, మండల వినియోగదారుల సమాచార కేంద్రాన్ని, జిల్లాస్థాయిలో డీఎస్వోను, డిస్ట్రిక్ కన్స్యూమర్ కౌన్సిల్ను జిల్లా వినియోగదారుల ఫోరం ద్వారా వినియోగదారు రక్షణ పొందవచ్చని ఆయన వివరించారు. గౌతమ్ బుద్ధ డిఎస్ఓ సంఘం, శ్రీ సావిత్రిబాయి పూలే డిఎస్ఓ సంఘం లీడర్లు, సీసీపీస్ డిల్లెమ్మ, కన్నమ్మ, సుకన్య, సరోజమ్మ, ఉష, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సరికొత్త కలుపు నివారిణి

'దినకర్' ఆవిష్కరణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: దేశంలోని వ్యవసాయ రసాయన పరిశ్రమలో అగ్రగామి సంస్థ అయిన ధనుకా అగ్రిటెక్ లిమిటెడ్, తాము రూపొందించిన సరికొత్త కలుపు నివారిణి 'దినకర్' ను ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ధనుకా అగ్రిటెక్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ ధనుకా విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడారు. దినకర్తో వరి రైతులకు వారి రోజువారీ కష్టాలపై లోతైన పరిష్కారాన్ని చూపే ఉత్పత్తిని తీసుకువస్తున్నామన్నారు. దినకర్ నాట్లు వేసిన వరి కోసం ప్రత్యేకంగా రూపొందించిన తర్వాతి తరం కలుపునాశి అని, ఈ ఉన్నత స్థాయి ఆవిష్కరణ రైతులకు అత్యాధునిక, స్థిరమైన పంట సంరక్షణ పరిష్కారాలను అందించడంలో కంపెనీకి ఉన్న నిబద్ధతకు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జపాన్కు చెందిన హొక్కో కెమికల్ ఇండస్ట్రీ కో.లిమిటెడ్, సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్షినిచి హయకావాసాన్, అంతర్జాతీయ విక్రయ విభాగం మేనేజర్ కోచి ఒగిటాసాన్ హాజరయ్యారు. కార్యక్రమంలో నేషనల్ సేల్స్ హెడ్ రమేష్ రెడ్డి, జీఎం హుస్సేన్ వలి, పరశురామయ్య పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహావిష్కరణ నా అదృష్టం : ఎమ్మెల్యే బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పీడిత వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతీ రావు పూలే విగ్రహాలను ఆవిష్కరించడం తన అదృష్టమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అన్నారు. మంగళవారం తొట్టంబేడు మండలంలోని పెద్దకనపర్తి గ్రామంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని, పెద్దకన్నలి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాలను ఆవిష్కరించారు. మహనీయుల త్యాగాలను ఎమ్మెల్యే గుర్తు చేశారు. టీడీపీ మండలాధ్యక్షులు రావిళ్ల మునిరాజానాయుడు, కన్నలి ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ప్రారంభం

గ్రీన్ ప్యానెల్ (సీఎస్ఆర్) సౌజన్యంతో పెద్ద కన్నలి ఎస్టీ కాలనీలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. సామాజిక సేవలో గ్రీన్ ప్యానల్ పరిశ్రమ పాలుపంచుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు.

వీధి విక్రయదారులపై

అధికారుల దౌర్జన్యం అన్యాయం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలోని బొంతాలమ్మ గుడి వెనకవైపు గల వీధి విక్రయదారులను మున్సిపల్ అధికారులు జెసిబిలు తీసుకెళ్లి కూల్చివేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. మంగళవారం యశోదానగర్లోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ అధికారులు జెసిబిలు తీసుకెళ్లి కూల్చివేయడాన్ని అడ్డుకోబోయిన ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. తిరుపతి నగరంలో అనేక ప్రాంతాలలో ట్రాఫిక్కి ఇబ్బందులు కలిగించే పెద్దపెద్ద వ్యాపారస్తులను వదిలిపెట్టి చిరు వ్యాపారులపై ప్రతాపం చూపటం తెలుగుదేశం కూటమి ప్రభుత్వానికి తగదని, చిరు వ్యాపారాలకు నష్టం కలిగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే వారి వస్తువులను వారికి ఇప్పించాలని వారికి జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, ట్రాఫిక్కి ఇబ్బందులేని పద్ధతుల్లో విక్రయదారులకు సూచనలు చేసి వారి ఉపాధిని దెబ్బతీయకుండా కొనసాగించాలని కోరారు. వీధివిక్రయదారుల పోరాటానికి సిపిఎం అండగా ఉంటామని పేర్కొన్నారు. సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి వేణు, వీధి విక్రయదారుల యూనియన్ నాయకులు బుజ్జి పాల్గొన్నారు.

కౌటిల్య విద్యార్థికి ఐసెట్‌లో స్టేట్ 2 వ ర్యాంకు

ప్రజాశక్తి - క్యాంపస్: తిరుపతి ఎంఆర్.పల్లి సర్కిల్ వద్ద వున్న 'కౌటిల్య ఇన్స్టిట్యూషన్' సంస్థకి చెందిన విద్యార్థి ద్వారకచర్ల సందీప్ రెడ్డికి ఈనెల 20న విడుదలైన ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ఫలితాలలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సాధించాడు. ఇతను ప్రస్తుతం కౌటిల్యలో జాతీయ స్థాయి పరీక్ష 'క్యాట్' (కామన్ అడ్మిషన్ టెస్ట్)కు సన్నద్ధమవుతున్నాడు. వీరితో పాటు మరికొంత మంది కౌటిల్య విద్యార్థులకు ఐసెట్లో మంచి ర్యాంకులు సాధించారు. ఈవిద్యార్థులను కౌటిల్య సంస్థ అభినందించింది. ఈ కార్యక్రమంలో కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్, ఫ్యాకల్టీ, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌటిల్య డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ 'కౌటిల్య విద్యార్థులు గత ఐసెట్ పరీక్షలలో స్టేట్ మొదటి ర్యాంకు రెండు సార్లు, పది లోపల ర్యాంకులు అనేక సార్లు సాధించారు. క్యాట్ కోచింగ్ ద్వారా ఐఐఎంలలో (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్) కాలేజీలలో అనేక మంది విద్యార్థులు ఎం.బి.ఎ అడ్మిషన్ సాధించారని అన్నారు. పేరెంట్స్ విద్యార్థులకు ఉచిత కెరీర్ గైడెన్స్ అవసరమైన వారుకు ఫోన్ చేసి సంప్రదించవచ్చు అని అన్నారు.

సందీప్ రెడ్డి ఇంటర్వ్యూ..

ఈ సంవత్సరం నవంబర్లో జరిగే జాతీయ స్థాయి క్యాట్ (కామన్ అడ్మిషన్ టెస్ట్) పరీక్షలో టాప్ స్కోర్ సాధించి ఇండియాలోని టాప్ ఐఐఎం (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్)లు అయిన అహ్మదాబాద్, బెంగళూరు, కలకత్తాలలో ఎంబిఏ అడ్మిషన్ సాధించి ఇండియాలోని కార్పొరేట్ కంపెనీలలో టాప్ లెవెల్ మేనేజ్మెంట్ ఉద్యోగం సాధించడం. ఎందుకంటే ఈ ఐఐఎంలు అనేవి ఇండియాలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా ప్రసిద్ధి చెందినవి. వీటిలో మేనేజ్మెంట్ విద్య ద్వారా అత్యంత ఆధునాతన నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అంది పుచ్చుకోవచ్చు. తద్వారా దీర్ఘకాల భవిష్యత్తులో మనమే కొత్త కంపెనీలను స్థాపించవచ్చు కూడా. మన దేశంలో టాలెంట్ వున్న యువతతో జత కట్టి మన దేశ ఆర్థిక రంగంలో అనేక విప్లవాత్మక విజయాలు సాధించవచ్చు, సమాజంలో యువతకు సహాయపడి, విలైనంత వరకు మార్గదర్శిగా ఉండాలని అనేది నా దీర్ఘ కాలిక లక్ష్యం.

శ్రీకాళహస్తిలో జోరు వాన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిని మంగళవారం సాయంత్రం జోరువాన పలకరించింది. నైరుతి రుతుపవనాల కారణంగా వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడి ఉపరితల ఆవర్తనం కారణంగా గత మూడు రోజులుగా తిరుపతి జిల్లాలో అక్కడక్కడా జోరువానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి పట్టణ వాసులను జోరువాన పలకరించి గంటసేపు పులకరించేలా చేసింది. ఈ క్రమంలో దైనందిన పనులకు కాస్తంత అడ్డంకులెదురైనా ప్రజలు హాయిగానే స్వాగతించారు. మిర్చిలా మండాల్సిన మే ఎండలు ముందస్తుగా వచ్చిన నైరుతి రుతుపవనాల కారణంగా వర్షా కాలాన్ని తలపిస్తుండడం గమనార్హం.

తుడా ఛైర్మన్ ప్రమాణ స్వీకారానికి తరలిరండి

వార్డు సభ్యులు ఎంజి.రెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట

యువ నేత డాలర్స్ దివాకర్ రెడ్డి తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) ఛైర్మన్గా ప్రమాణం స్వీకారం చేయనున్నారు. 21న బుధవారం సాయంత్రం ఐదు గంటలకు సెంట్రల్ పార్క్ రోడ్డు ఎదురుగా తుడా సర్కిల్ కార్యక్రమం జరుగుతుందని, కావున కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈకార్యక్రమంలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని రేణిగుంట టిడిపి యువ నాయకుడు, వార్డు సభ్యుడు ఎంజీ.రెడ్డి పిలుపునిచ్చారు.

సేవా దృక్పథం మెండుగా కలవాడు
డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ
సేవా దృక్పథం మెండుగా కల స్నేహశీలి డాలర్స్ దివాకర్ రెడ్డి అని తిరుపతి చెర్లోపల్లికి చెందిన టిటిడి స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ బొల్లినేని శుభగిరి నాయుడు కొనియాడారు. డాలర్స్ దివాకర్ రెడ్డి తుడా ఛైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపడుతున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ డాలర్స్ దివాకర్ రెడ్డి వ్యాపార రంగంలోనే కాకుండా, దాదాపు పది సంవత్సరాలుగా తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, తదితర ప్రాంతాలలో పలు రకాల సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి అభిమానం పొందాడని తెలిపారు. తన చుట్టుపక్కల వారికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడంలో ముందు ఉంటాడని వెల్లడించారు. తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్నటువంటి మిత్రుడు దివాకర్ రెడ్డికి హృదయపూర్వక అభినందనలు, భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.



గృహమే స్వర్గసీమ
అమిగోస్ అందుకు చిరునామా

అనిత్ రెడ్డి
అమ్మిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: గృహమే స్వర్గసీమ అన్నాడో మహాకవి. దానికి చిరునామాగా నిలుస్తోంది అమిగోస్. మధ్య తరగతి ప్రజలు సొంతింటి కలను నెరవేర్చేందుకు అన్ని రకాల సదుపాయాలతో, సరసమైన ధరలతో సొంతింటిని సాకారం చేసుకునేందుకు అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ నిత్యం కృషి చేస్తుందని ఆ సంస్థ అదినేత అనిత్‌రెడ్డి తెలిపారు. తిరుపతి – కరకంబాడీ రోడ్డు తిమ్మినాయుడు పాళెం కూరపాటి లేఅవుట్ సమీపంలో, తిరుపతి రూరల్ అవిలాల గ్రామ సచివాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్ ఓక్స్ అపార్టుమెంట్ వద్ద ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రజల ప్రతి ఆసక్తి, ప్రాధాన్యతను అందించడం, విశ్రాంతి కార్యకలాపాల హద్దులేని రాజ్యాన్ని ప్రదర్శించడం అవసరమన్నారు. మా అపార్టుమెంట్‌లో ఈ సౌకర్యాలు మెండుగా ఉంటాయన్నారు. రెండు, మూడు, నాలుగు బెడ్‌రూమ్స్ అందుబాటులో ఉన్నాయి. క్రీడా సౌకర్యాలతో చురుకైన జీవనశైలిని ఆలింగనం చేసుకోండి, ఆరుబయట వినోదం కోసం విశాలమైన పచ్చిక బయళ్ళు, చైతన్యం నింపే స్త్రోల్స్‌ను ఆహ్వానించే సుందరమైన వాకింగ్ ట్రాక్‌లు. ఇండోర్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం, టేబుల్ టెన్నిస్ నుండి బిలియర్డ్స్ వరకు వివిధ రకాల ఆటలలో మునిగి తేలడం, విశ్రాంతి ఆనందానికి అంతులేని అవకాశాలను అందించేలా కృషి చేస్తున్నామన్నారు. ఆకర్షణీయమైన సిమ్మింగ్‌పూల్, ప్లేగ్రౌండ్, మల్టీపర్పస్ పార్టీ హాల్. విశ్వాసం, అచంచలమైన నిబద్ధత. లోతైన డొమైన్ నైపుణ్యం, మీ జీవితానికి బలమైన పునాదిని నిర్మించడం, తిరుపతి రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో విజనరీ అప్రోచ్ వారి నైపుణ్యం, ఉత్సాహం రెండింటినీ ప్రతిబింబించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రాపర్టీస్ నమ్మకం, కస్టమర్ సంతృప్తి ఆధారంగా ఆశించదగిన ఖ్యాతిని పొందాయి. నమ్మశక్యం కాని నివాస స్థలాల నుండి కమర్షియల్ కాంప్లెక్స్‌ల వరకు, అసాధారణమైన నాణ్యతను అందించడానికి మా అంకితభావం అనేక మంది వినియోగదారుల విశ్వాసాన్ని పొందింది, ఇదే వినియోగదారుల సంఖ్యను పెంచుతోంది. హోలిసిటీ, రిలాక్స్, సంతోషించు, విశ్రాంతి పొందండి, ప్రశాంతత, విశ్రాంతి సారాంశాన్ని వినియోగదారులు అనుభవించాలని సూచించారు. అద్భుతమైన ల్యాండ్ స్కేపింగ్‌తో సజావుగా మిళితమై ఉన్న నిష్కళంకమైన ఆర్కిటెక్చర్ అద్భుతమైన ఫ్రంట్ వ్యూతో మంత్రముగ్ధులయ్యేలా సిద్ధం చేసుకోండి. గ్రాండ్ ఎంట్రన్స్ నుండి కళ్లకు విజువల్ ఫీస్ట్‌ను రూపొందించడం ద్వారా నిశితంగా రూపొందించబడిన ముఖభాగం వరకు, ప్రతి వివరాలు ఆనందాన్ని కలిగించడానికి, స్ఫూర్తినిచ్చేలా రూపొందించబడ్డాయి అని తెలిపారు. సొంతింటి అభిరుచిగల ప్రతి ఒకరి అంచనాలకు తగ్గట్టుగా అపార్టుమెంట్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9603222822, 9603222722 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు...
- 24/7 సెక్యూరిటీ. - గేటెడ్ కమ్యూనిటీ.
- లగ్జరీ క్లబ్ హౌస్ - అవుట్ డోర్ అమేనిటీస్
- ఇండోర్ డోర్ అమెనిటీస్ - లగ్జరీ స్విమ్మింగ్ పూల్
- సోలార్ పవర్‌తో కూడిన పెన్సింగ్. - వాకింగ్ ట్రాక్.
- చిన్నపిల్లలకు ప్రత్యేకంగా క్రీడాప్రాంతం.
- ఆకర్షనీయమైన మొక్కలతో కూడిన బృందావనం.

ప్రాజెక్ట్ లక్షణాలు
- 100% వాస్తు - సురక్షిత గేటెడ్ కమ్యూనిటీ
- భూగర్భ విద్యుత్తు - పవర్ బ్యాకప్ ప్రొవిజన్
- ఎలక్ట్రిసిటీ పోల్స్ డిజైనర్ - అధునాతన భద్రతా వ్యవస్థ
- సిసి కెమెరా సర్వైలెన్స్ సిస్టమ్
- ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ పాయింట్లు
- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సోలార్ సెక్యూరిటీ సిస్టమ్
- రెయిన్వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్
- చెట్లతో కప్పబడిన అవెన్యూ ప్లాంటేషన్
- శుద్ధి చేసిన నీటి సరఫరా - ప్రెజర్ పంపులు
- 24 గంటలు అంతరాయం లేని నీటి సరఫరా

దివాకర్ రెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు పొందాలి

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) ఛైర్మన్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టనున్న నా మిత్రుడు శ్రేయోభిలాషి డాలర్స్ దివాకర్ రెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు పొందాలని అమీబోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత అనిత్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ డాలర్స్ దివాకర్ రెడ్డి కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ, ఒక ప్రణాళిక ప్రకారం సేవా కార్యక్రమాలు చేపడుతూ, అందర్ని కలుపుకొని పోయేవాడని, కూడా ఛైర్మన్ గా బాధ్యతలు చేపడుతున్న డాలర్స్ దివాకర్ రెడ్డికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

బ్రాండెడ్ మొబైల్స్‌కు చిరునామా 'వేదం'

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రముఖ బ్రాండెడ్ మొబైల్స్‌కు 'వేదం' మొబైల్ షోరూమ్ చిరునామాగా నిలిచిందని ఆ సంస్థ అధినేత, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆముదాల ప్రభాకర్ (గోల్డెన్ ప్రభాకర్) తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని గోల్డెన్ ప్లాజ్ వద్ద 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ సమయం...సాంకేతికం ప్రతి ఒకరికి అవసరమని, అందుకే ఆ రంగంలో అడుగెట్టి, 39 సంవత్సరాల అనుభవంతో వినియోగదారులకు నాణ్యమైన, మన్నికైన వాచ్‌లు, మెబైల్స్, వస్త్రాలు అందిస్తున్నామని వెల్లడించారు. వేదవల్లి, నాగరత్నం దంపతులకు ఐదుగురు సంతానం, నలుగురు మగవారు, ఒక ఆడబిడ్డ. ప్రయివేట్ బస్సు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న నాగరత్నంకు చివరి సంతానం ఆముదాల ప్రభాకర్. తన కుటుంబం చిన్నతనం నుంచే కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగించడంతో భవిష్యత్తులో తాను మంచి ఉన్నతస్థానానికి చేరుకుని కుటుంబాన్నికి అండగా ఉండాలని ప్రభాకర్ తపనపడేవారు. చిన్నతనంలోనే కుటుంబ పోషణలో నాన్నకు చేదోడు వాదోడుగా ఉండాలని భావించి 1984లోనే నెలకు కేవలం రూ.60ల వేతనానికి వాచ్‌షాపులో పని చేశాడు. వాచ్‌లు (గడియారాలు) విక్రయాల్లో, వాటి నాణ్యత, సర్వీసు, తదితర వాటిలో కొంత అనుభవం గడించిన తర్వాత తానే సొంతంగా వాచీల వ్యాపారం చేయాలని తలిచాడు. అక్క కాంచన ప్రోత్సహంతో వ్యాపారంగంలోకి అడుగెట్టాడు. 1993లో నిమ్మకాయల వీధిలో మొట్టమొదటిగా వాణి టైమ్స్‌ను స్థాపించారు. సరికొత్త మొబైల్స్ (సెల్‌పోన్లు) అరంగేట్రం చేస్తున్న రోజుల్లో తొలిసారిగా 2001లో గాంధీరోడ్డులో గోల్డెన్‌ప్లాజా షోరూమ్‌ను ఏర్పాటు చేశారు. అందులో అన్ని రకాల కంపెనీలకు చెందిన వాచీలు, సెల్‌ఫోన్ల క్రయవిక్రయాలు సాగించారు. నాణ్యమైన, మన్నికైన వస్తువుల విక్రయం వల్ల అనతీకాలంలోనే వినియోగదారుల మన్నలను చూరగొన్నారు. ఆముదాల ప్రభాకర్ కాస్త గోల్డెన్ ప్రభాకర్‌గా వినతికెక్కారు. ఇక అక్కడ నుంచి వెనుతిరిగి చూడలేదు. కేవలం సెల్‌పోన్ల కోసమే ప్రత్యేక షోరూమ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించి 2009లో ఆయన తల్లి పేరుతో వేదం మొబైల్ షోరూమ్‌ను స్థాపించారు. 2017లో ఎక్స్‌క్ల్యూజివ్ కంపెనీ షోరూమ్‌లను స్థాపించారు. అటు తర్వాత వస్త్ర వ్యాపార రంగంలోకి అడుగెట్టి సరికొత్త వస్త్ర షోరూమ్ మాన్యవర్‌ను ఏర్పాటు చేశారు. టైటాన్, మాన్యవర్ వంటి ప్రముఖ బ్రాండెడ్ కంపెనీలతో టైయప్ చేసుకుని, వాటి ఉత్పత్తుల విక్రయాల కోసం తిరుపతిలో ప్రత్యేక షోరూమ్‌లను ఏర్పాటు చేసి, దేశ, విదేశ ఉత్పత్తులను సైతం తిరుపతి వాసులకు అందుబాటోలకి తీసుకొచ్చారు. 1999లో లోకేశ్వరితో వివాహం అయినప్పటి నుంచి ఆమె సహకారంతో వ్యాపార రంగంలో మరింత దూసుకెళ్ళారు. వారికి ఇద్దరు మగసంతానం, ఇరువురు కూడా ఉన్నత చదువుల చదువుతున్నారు. కుటుంబ పోషణ కోసం నెలకు కేవలం రూ.60ల జీతంతో పనివాడిగా చేరిన ఆయన పట్టుదల, క్రమశిక్షణతో ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లుతూ 39 సంవత్సరాల వ్యాపార అనుభవంతో ప్రస్తుతం 100మందికిపైగా యువతీయువకులకు ఉపాధి కల్పిస్తుండడం గమనార్హం. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యాపారం అంటే పోటీనే కానీ నేనెప్పుడు పోటీ దృక్పథంతో ముందుకెళ్లలేదు. వినియోగదారుల నమ్మకాన్ని చూరుగొనేందుకు నిరంతరం కృషి చేశాను. లాభపేక్ష కాకుండా నాణ్యమైన, నమ్మకమైన ఉత్పత్తులను సరసమైన ధరలకు వినియోగదారులకు అందిస్తు, వారి నమ్మకాన్ని చురుగొన్నాను. వినియోగదారులు నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను ఎప్పటికి వమ్ముచేయలేదు. అదే నా విజయ రహస్యం అని అన్నారు. ఓం ప్రకాష్, కల్యాణ్‌కుమార్, జగదీష్, కుటుంబ సభ్యులు సహకారం, ప్రోత్సాహం తాను ఎప్పటికి మరిచిపోనని పేర్కొన్నారు. చదువుతో పాటు సంస్కారం ఉండాలి, నిరంతరం ఆత్మవిశ్వాసంతో పనిచేస్తే తప్పకుండా విజయం సాధించొచ్చని నూతనంగా వ్యాపారంగంలోకి అడుగెడుతున్న యువతకు ఆయన సూచించారు.

పలమనేరు బాలాజీ కథలకు
సడ్లపల్లె సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి- పలమనేరు
కవి, రచయిత, విమర్శకుడు పలమనేరు బాలాజీ రాసిన 'ఏకలవ్య కాలనీ' కథా సంపుటికి సడ్లపల్లె సాహిత్య పురస్కారం 2025కు ఎంపికయ్యిందని హిందూపురానికి చెందిన ఆ సంస్థ నిర్వాహకులు సడ్లపల్లె చిదంబరరెడ్డి సమాచారం అందించారు. తన ఊరి పేరునే ఇంటి పేరుగా మార్చుకొని కథ కవిత్వం నవల విమర్శ ప్రక్రియల్లో 1991 సంవత్సరం నుండీ కృషి చేస్తున్న పలమనేరు బాలాజీ తెలుగు సాహిత్యంలో తొలిసారిగా ఎరుకల జీవన గాధలను 'ఏకలవ్య కాలనీ' పేరిట కథల పుస్తకంగా 2024 డిసెంబరులో వెలువరించారు. ఈ పుస్తకానికి ఇటీవలే కెనడా తెలుగుతల్లి సాహిత్య పురస్కారంతో పాటు గీతాంజలి స్మారక స్మారక సాహిత్య పురస్కారం కూడా అందుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పెద్దపంజాణి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న బాలాజీ ఇప్పటికి నాలుగు కథా సంపుటాలను, మూడు కవితా సంపుటాలను, నవలను వెలువరించారు. కేంద్రసాహిత్య అకాడమీ ఆహ్వానంపై జాతీయస్థాయిలో తెలుగు భాషా ప్రతినిధిగా శాంతినికే తనకు వారం రోజులపాటు అతిథిగా వెళ్లి వచ్చారు. ఆయన కవిత్వం కన్నడ, మలయాళం, తుళు, ఆంగ్ల తమిళ భాషల్లో కూడా అనువాదం చెందింది. కథలు, కవిత్వం కన్నడ, ఆంగ్ల భాషల్లో అనువాదం చెంది పుస్తకాలుగా వెలువడ్డాయి. తన రచనలకు స్మైల్ పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం, కందుకూరి వీరేశలింగం పంతులు స్మారక పురస్కారం, నూతలపాటి గంగాధరం సాహిత్య పురస్కారం, మాడభూషి రంగాచార్య స్మారక కథాపురస్కారం, గీతాంజలి స్మారక పురస్కారం, కెనడా తెలుగుతల్లి సాహిత్య పురస్కారం, కామాక్షి బాయి నారాయణరావు సాహితీ పురస్కారం అందుకున్నారు. ఇలా అనేక జాతీయ అంతర్జాతీయ సాహిత్య సదస్సులలో, కవి సమ్మేళనాలలో తెలుగు భాషా ప్రతినిధిగా పలమనేరు బాలాజీ పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీద రెండు పర్యాయాలు రాష్ట్ర తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన రచించిన రచనలపై తెలుగు విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు జరిగాయి. కేంద్ర సాహిత్య అకాడమీ ద్వారా కవి సంధి కార్యక్రమం ద్వారా అంతర్జాలంలో జాతీయస్థాయిలో తన కవిత్వాన్ని వినిపించారు. పలమనేరు బాలాజీకి సడ్లపల్లె సాహిత్య పురస్కారం లభించడం పట్ల స్థానిక రచయితలు కవులు సాహిత్య సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

తుడాకు సమర్థవంతమైన చైర్మన్‌గా

డాలర్స్ దివాకర్ రెడ్డి

- అందరిని కలుపుకోపోయే వ్యక్తిత్వం
- రాజకీయాలకు అతీతంగా అన్ని
- నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తా డాలర్స్ దివాకర్ రెడ్డి
- నేడు తుడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తిరుపతి జిల్లా రాజకీయాల్లో డాలర్స్ దివాకర్ రెడ్డి క్రమశిక్షణతో కూడిన రాజకీయం చేస్తున్నారు. వివాదాలకు దూరంగా ఆత్మీయతకు దగ్గరగా సోదర భావంతో ప్రజలలో ఉంటూ అనతికాలంలోనే ప్రజాభిమానాన్ని కూడబెట్టుకున్నారు.



తిరుపతి జిల్లా రాజకీయాల్లోనే డాలర్స్ దివాకర్ రెడ్డి ఆణిముత్యంలా మెరిసారు. డాలర్స్ దివాకర్ రెడ్డి విధేయతకు తెలుగుదేశం పార్టీ తుడా పదవితో సత్కరించింది. టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు డాలర్స్ దివాకర్ రెడ్డికి చైర్మన్ పదవి ఖరారు చేయడం జరిగింది. తుడా చైర్మన్ పదవితో పాటు టీటీడీ ప్రత్యేక ఆహ్వానితులు, సభ్యులుగా ఉంటారు. తుడా చైర్మన్ పదవికి ఎంతో మంది పేర్లు వినిపించినప్పటికీ ప్రయత్నాలు చేసిన కూడా డాలర్ దివాకర్ రెడ్డివైపే అధిష్టానం మొగ్గుచూపింది. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థుల గెలుపుకు ఎంతో కృషి చేశారు, డాలర్ దివాకర్ రెడ్డి బంధుజనం ఉన్న చోట అంతా కూటమి పార్టీకి ఓట్లు వేయించారు.

విధేయతకు పట్టం...

పులివర్తి నాని, చంద్రగిరి ఎమ్మెల్యే

టిడిపిలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని పదేపదే చెబుతున్న సీఎం చంద్రబాబు నాయుడు డాలర్స్ దివాకర్ రెడ్డి విషయంలో అది చేసి చూపించారు. టిడిపిలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు లభిస్తుంది అనడానికి ఇదే నిదర్శనం. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని డాలర్స్ దివాకర్ రెడ్డి విధేయుతకు తుడా చైర్మన్ పదవి లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ నాయకులు గెలుపులో డాలర్స్ చేసిన కృషి అమోఘమన్నారు. ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, నగిరి నియోజకవర్గంలో డాలర్స్ ఒక సైనికుడిలా పనిచేసి తన గెలుపులో కీలకపాత్ర పోషించారని అన్నారు. క్రమశిక్షణ రాజకీయాలతో డాలర్స్ ప్రజల మనసు గెలుచుకున్నారని అటువంటి వ్యక్తి తుడా చైర్మన్ పదవికి అసలైన అర్హుడని అన్నారు.

అంబరాన్ని అంటిన సంబరాలు...

– ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

తుడా అధ్యక్ష పదవిని ప్రకటించడంతో ప్రజలు, దివాకర్ రెడ్డి అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్ ఆదేశాలనుసారం తుడా చైర్మన్ పదవి డాలర్స్ దివాకర్ రెడ్డి సొంతం చేసుకున్నారని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. వివాద రహితుడుగా, అందరివాడిగా తిరుపతి ప్రజలు, నాయకులు మనసును గెలుచుకున్న నాయకుడుగా దివాకర్ పేరు పొందారని తెలిపారు. ఎన్నికల్లో తన గెలుపులో డాలర్స్ దివాకర్ రెడ్డి అమోఘంగా కృషి చేశారని పేర్కొన్నారు.



అటువంటి వ్యక్తికి తుడా చైర్మన్ పదవి రావడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.

టీడీపీ రాజకీయాల్లో డాలర్స్ ఆణిముత్యం..

– బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ రాజకీయాల్లో డాలర్స్ దివాకర్ రెడ్డి ఆణిముత్యం వంటి వారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కొనియాడారు. దివాకర్ రెడ్డి వ్యక్తిత్వం, సోదరభావంతో అందరి ప్రేమాభిమానాలు సొంతం చేసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. దివాకర్ రెడ్డికి తుడా చైర్మన్ పదవి రావడం తనకెంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో తుడా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

అందరిని కలుపుకుపోయే వ్యక్తిత్వం...

డాలర్స్ దివాకర్ రెడ్డిది అందర్నీ కలుపుకో పోయే వ్యక్తిత్వమని తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగిరి నియోజవర్గ ప్రజలు, టిడిపి కార్యకర్తలు అంటున్నారు. డాలర్స్ దివాకర్ రెడ్డి రాజకీయాలకు అతీతంగా వ్యవహరించే వారని, ఆపదలు ఎవరు ఉన్నప్పటికీ వారికి సహాయం చేసే గుణం ఉందని అభిమానులు అంటున్నారు. ఆయన ఇటీవల అనేక సేవా కార్యక్రమాలు కూడా చేశారని కొనియాడారు.

ఐటి మంత్రి నారా లోకేష్‌తో దివాకర్ రెడ్డి

వరద బాధితులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం...

విజయవాడ ఇటీవల వరదలు రావడంతో అనేక కాలనీ ముప్పు గురికాగా, మరికొన్ని ఇల్లు నేలమట్టమయ్యాయి. చాలామంది వరదల్లో సర్వసం కోల్పోవడం జరిగింది. వారిని ఆదుకోవడానికి డాలర్స్ దివాకర్ రెడ్డి రూ.10 లక్షలు వరద బాధితులకు సాయంగా ముఖ్యమంత్రి సీఎం చంద్రబాబు నాయుడు సమక్షంలో చెక్కును అందించారు. అంతేకాకుండా వరద బాధితులకు అవసరమైన బట్టలు, నిత్యావసర వస్తువులు కూడా పంపిణీ చేసి ఆదుకోవడం జరిగింది. గతంలో వచ్చిన వరదల్లో కూడా బాధితులకు దివాకర్ రెడ్డి తన వంతు ఆర్థిక సాయం రాష్ట్ర ప్రభుత్వానికి అందించిన విషయం తెలిసిందే..

తుడాకు పూర్వ వైభవం తీసుకొస్తా..

తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు పూర్వవైభవం తీసుకోవడానికి తన వంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ప్రజాశక్తికి తెలిపారు. గ్రామాల అభివృద్ధి చెందితేనే తుడా కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తుడా పరిధిలో ఉండే గ్రామాలను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకుని వాటిని దశలవారికి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. అవసరమైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యలు పరిష్కారమయ్యేలా చేస్తానన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుతో డాలర్స్ దివాకర్ రెడ్డి

పేద విద్యార్థులకు స్కాలర్‌షిపులు

పదవ తరగతి, ఇంటర్లో పరీక్షలు అత్యధిక మార్కులతో పాసైన విద్యార్థులకు డాలర్స్ దివాకర్ రెడ్డి స్కాలర్షిప్లు కూడా అందజేస్తున్నారు. ఒక్కొక్క విద్యార్థికి రూ.5 నుంచి 10వేలు స్కాలర్షిప్లు ఇవ్వడం జరిగింది. అలాగే పోలీసు కుటుంబాల్లో ఉన్న పేద విద్యార్థులకు కూడా సుమారు రూ.10 లక్షలు స్కాలర్షిప్లు అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులతో పాస్ అయిన విద్యార్థులకు ఇంటర్లో కార్పొరేట్ కళాశాలలో చదువుకునేందుకు కూడా దివాకర్ రెడ్డి తన వంతు సహాయ సహకారాలు అందించారు.

క్రీడాకారులకు సహాయం....

దివాకర్ రెడ్డి ఇటు చంద్రగిరి అటు తిరుపతి ఇతర ప్రాంతాల క్రీడాకారులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు దుస్తులతో పాటు క్రీడాసామగ్రి, ఆట వస్తువులు ఆయన స్పాన్సర్షిప్ చేస్తున్నారు. దాంతోపాటు ప్రైజ్ మనీ కూడా ఇవ్వడంతో క్రీడాకారులకు మరింత ప్రోత్సహించినట్లు అయింది. గత ఐదు సంవత్సరాల కాలంలో తిరుపతితో పాటు చంద్రగిరి, శ్రీకాళహస్తిలో జరిగిన క్రీడల్లో సుమారు రూ.10 లక్షలకు పైగా ఆర్థిక సాయం అందించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తన వంతు స్పాన్సర్షిప్ కూడా అందిస్తున్నారు. ముఖ్యంగా క్రికెట్, కబడ్డీ, షటిల్‌తో పాటు ఇతర క్రీడల్లో పాల్గొనే వారికి ఏదో ఒక విధంగా దివాకర్ రెడ్డి ఆదుకుంటున్నారు.

తిరుపతి టిడిపి నాయకులు జెబి శ్రీనివాసులుతో

శెట్టిపల్లి భూ సమస్య నెలలో పరిష్కారం

ఎన్నో సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న శెట్టిపల్లి భూముల సమస్యను ఒక నెలలో పరిష్కారమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అందుకు తుడా కూడా తన వంతు కృషి చేస్తుందని అన్నారు. తుడా చైర్మన్ వచ్చిన వెంటనే శెట్టిపల్లి భూ సమస్యను సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. శెట్టిపల్లి వాసులకు టిడిపి హయంలోని శాశ్వతంగా భూ సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు ఇప్పటికే ఈ దిశగా పనులు ముమ్మరం చేస్తున్నారని వెల్లడించారు. శెట్టిపల్లి భూ సమస్యను పరిష్కరించిన వెంటనే ఆ ప్రాంత అభివృద్ధికి కూడా కృషి చేస్తున్న వెల్లడించారు.

తుడా టవర్స్ పూర్తి చేసి ఆదాయ వనరులను పెంచుతాం..

తుడా నిధులతో రాయల్ చెరువు వద్ద నిర్మిస్తున్న 12 అంతస్తుల టవర్స్ పనులు వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ లోపల పూర్తి చేసి వాటి ద్వారా తుడా ఆదాయ వనరులు పెంచుకోవడానికి చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. ప్రస్తుతం తుడా టవర్స్ పనులు జరుగుతున్నాయని దాన్ని పరిశీలించి ఆ టవర్ పనులు పూర్తి అయ్యే విధంగా చూస్తామన్నారు. అలాగే తుడాను అభివృద్ధి పరిచి తుడా ఖజానా నింపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. తుడా పరిధిలో ఉండే పలు నియోజకవర్గాల్లో తుడా టౌన్ షిప్ పేరుతో లేఅవుట్లు వేసి వాటిని అభివృద్ధి చేస్తామన్నారు. అవసరమైతే ప్రభుత్వ భూములు తీసుకుని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

22 ఏలో ఉన్న భూములు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

తుడా పరిధిలో వేసిన కొన్ని లే అవుట్‌లు 22 ఏలో ఉన్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి, ఆ భూములను అభివృద్ధి చేయడమే కాకుండా 22 ఏలో నుంచి ఆ భూములు చేర్చకుండా చూస్తామన్నారు. కొన్ని లే అవుట్‌లు కోర్టు పరిధిలో ఉన్నాయని, వాటిని కూడా త్వరగా పరిష్కారమయ్యేలా తుడా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామని వెల్లడించారు. దీంతో పాటు తుడా పరిధిలో ఉండే పార్కులు, రోడ్లు, భవనాల అభివృద్ధి చేయడానికి ప్రణాళికలను తయారు చేస్తామన్నారు. తుడా పరిధిలో ఉండే అన్ని నియోజకవర్గాల అభివృద్ధి చేయడమే తమ తక్షణ కర్తవ్యం అన్నారు. టిడిపి ప్రభుత్వం ఇచ్చిన ఈ పదవికి వన్నె తెస్తానని తెలిపారు.

భూములు కాపాడుతాం...

తుడా పరిధిలో ఉండే భూములు కబ్జాలకు గురికాకుండా వాటికి ఫెన్సింగ్ వేసి కాపాడడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. తుడా పరిధిలో ఉండే అన్ని నియోజకవర్గాల్లో ఎక్కడెక్కడ భూములు ఉన్నాయో వాటిని గుర్తించి ఎక్కడ కబ్జా కాకుండా చర్యలు చేపడతామన్నారు. భవిష్యత్తు తరాల కోసం తుడా భూములు కబ్జా కాకుండా ఇప్పటి నుంచే రక్షించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు.

మాజీ మిలిటరీ ఉద్యోగి ఇంటి స్థలం కబ్జా

- దర్జాగా రేకుల ఇల్లు నిర్మాణం
- కబ్జాదారుడికి అండగా రెవెన్యూ సిబ్బంది
- న్యాయం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితుడు

ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్: వెంకటగిరి మండలం, వెంకటగిరి టౌన్ నివాసి కలవలపూడి వెంకటసుబ్బయ్య 1948 నుండి 1956 వరకు మిలిటరీలో డ్రైవర్‌గా పనిచేశారు. ఆయన రిటైర్ అయిన తర్వాత ఎక్స్ మిల్ట్రీ కింద వెంకటగిరి టౌన్ పరిధి కుమ్మరిమిట్ట ఏరియా సర్వేనెంబర్ 182–2 లో మిలిటరీ కాలనీలో ఐదు సెంట్లు ఇంటి స్థలం, పట్టా 1985 సంవత్సరంలో మంజూరు చేయడం జరిగింది. పట్టా ఇచ్చిన తర్వాత మిల్ట్రీ కాలనీలో ఎవరూ ఇళ్ల నిర్మాణం చేపట్టనందున కొన్ని సంవత్సరాలు ఆ ప్లాటు ఖాళీగా ఉండిపోయింది. ఇదే అదునుగా ధనబలం, రాజకీయ పలుకుబడి ఉన్న యారాశి యానాదిశెట్టి ఆ స్థలాన్ని కబ్జా చేశాడు. 2020 వ సంవత్సరంలో ఎవరికీ తెలియకుండా రాత్రికి రాత్రి ఆ స్థలంలో రేకుల ఇల్లు నిర్మించి తన ఆధీనంలో ఉంచుకున్నాడు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న బాధితుడు తన భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని, భూమిని తనకు ఇప్పించాలని కోరుతున్నారు. ఈ స్థలం తప్ప వేరే ఆధారం లేదంటూ రెవిన్యూ అధికారులు చుట్టూ గత నాలుగు సంవత్సరాలుగా తిరుగుతున్నారు. కానీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కబ్జాదారుడికి అధికారులు అండగా ఉన్నారని బాధితుడు ఆరోపించాడు. ఆర్‌టిఐ కింద సమాచారం అడిగితే తప్పుడు సమాచారం ఇచ్చారని తెలిపాడు.

23 సంవత్సరాలు మిలిటరీలోపనిచేసి, యాక్సిడెంట్‌లో నడుము విరిగిపోయినందున ఆర్మీ అధికారులు రిటైర్మెట్ ఇచ్చారని బాధితుడు తెలిపాడు. ఇప్పటికైనా తన ఇంటి స్థలం కబ్జానుండి కాపాడాలని బాధితుడు కోరుతున్నాడు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

కలెక్టర్ వెంకటేశ్వర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న నాగలాపురం – చిన్నపాండూరు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్లుకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తిరుపతి లోని జిల్లా కలెక్టర్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులను కలిసి సత్యవేడు నియోజకవర్గ సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగలాపురం – చిన్న పాండూరు రోడ్డు, దాసుకుప్పం బైపాస్ రోడ్డు, బి.ఎన్ కండ్రిగ – సూళ్లూరు పేట రోడ్డు, వినోభా నగర్ రోడ్లతో పాటు మరిన్ని రోడ్లు, వంతెనల నిర్మాణాలు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్నాయని ఈఈ కి వివరించారు. వినతులకు జిల్లా కలెక్టర్ సహా అన్నీ శాఖల అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సత్యవేడు తహశీల్దారుగా రాజశేఖర్

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు రెగ్యులర్ తహశీల్దార్‌గా రాజశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. సత్యవేడు తహశీల్దారుగా పనిచేస్తున్న టీవీ సుబ్రహ్మణ్యం డిప్యూటేషన్‌పై బదిలీ కావడంతో, వరదయ్యపాలెం తహశీల్దార్‌గా పని చేస్తున్న రాజశేఖర్‌కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే వరదయ్యపాలెం, సత్యవేడు మండలాల్లో రెవిన్యూకు సంబంధించిన సమస్యలను చూడడానికి పనిభారం అధికమైన క్రమంలో సత్యవేడు రెగ్యులర్ తహశీల్దారుగా రాజశేఖర్ నియమితులయ్యారు. కాగా వరదయ్యపాలెం నూతన తహశీల్దారుగా సుదీర్‌ను నియమించారని సమాచారం.

టంగుటూరికి ఘన నివాళి

యస్వీయులో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పరిపాలనా భవనంలోని ఆయన విగ్రహం దగ్గర ఉదయం 10:30 గంటలకు స్మారక కార్యక్రమం నిర్వహించారు. ఎస్వీయూ ఇంచార్జి విసి ఆచార్య సిహెచ్. అప్పారావు మాట్లాడుతూ టంగు టూరి ప్రకాశం పంతులు ఒక మహెూన్నత వ్యక్తిత్వం గల వారుని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం. భూపతినాయుడు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే బొజ్జల

జాతరలో అభిమానులతో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లో మంగళవారం జరిగిన గంగమ్మ జాతరలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ నగర్ వాసులు గంగమ్మ ఆశీస్సులతో సుఖ:శాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జి నెమళ్లూరి బుజ్జి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం

స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను చూపుతున్న అధికారులు

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: జిల్లా అటవీ శాఖ అధికారుల ఆదేశాలతో బాకరాపేట అటవీ క్షేత్రాధికారి వెంకటరమణకు అందిన రహస్య సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఓఎస్ గొల్లపల్లి రోడ్డు మీదుగా కారులో తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం తరలిస్తుండగా కాపు కాచి వెంబడించామని ఫరెస్ట్ అధికారులు తెలిపారు. ప్రసాద్ నగర్ రోడ్డు సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెన ప్రక్కన గల శివాలయం వద్ద వాహనాలను వదిలేసి ముగ్గురు స్మగ్లర్లు పరారయ్యారని తెలిపారు. కారును పరిశీలించగా ఎనిమిది ఎర్రచందనం దుంగలు పట్టుబడ్డాయన్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం కొయ్యలు బరువు 145 కేజీలు ఉండగా వీటి విలువ సుమారు 8 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ ఆపరేషన్‌లో ఎఫ్ఎస్ఓ, మునిస్వామి నాయక్, ఎఫ్‌బిఓలు, లక్ష్మీ ప్రసాద్, రాజేష్ కుమార్, డ్రైవర్లు ప్రభు తేజ, శంకర్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక సేవలు

విభిన్న ప్రతిభావంతుల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న తిరుపతి జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ప్రత్యేక సేవలు అందించేందుకు భవిత కేంద్రాలు ఏర్పాటు చేసిందని తిరుపతి జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను పాఠశాలలో పేరు నమోదు చేసే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిగరాల చెరువు, ముందరపల్లి, రెడ్డివారిపల్లి, అరవవాండ్లపల్లి, చిన్నగొట్టిగల్లు మసీదు వీధిలో సహిత ఉపాధ్యాయుల చేపట్టిన సర్వేను ఆయన పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో స్పీచ్ థెరపి, ఫిజియోథెరపీ , ఉచిత హియరింగ్ ఎయిడ్స్ (చెవిటి మిషన్లు) తదితర ఉపకరణాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారులు వై.సత్యనారాయణ, బి.గోపీనాథ్ ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో మిని మహానాడు

సమావేశంలో మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజాశక్తి - రామచంద్రపురం (తిరుపతి రూరల్): మూడు దశాబ్దాల తర్వాత చంద్రగిరిలో తెలుగుదేశం పార్టీ విజయానికి కష్టపడిన కార్యకర్తలకు, నన్ను ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో గెలిపించి పట్టం కట్టిన ప్రజల సేవకే నా జీవితం అంకితం చేస్తానని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అన్నారు. మంగళవారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ రిసార్ట్స్‌లోని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ మినీ మహానాడు విజయవంతంగా జరిగింది. మొదటగా పార్టీ జెండా ఆవిష్కరించి, స్వర్గీయ ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు సంతాపాన్ని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ జూన్ మొదటి వారం నుండి ప్రతి గ్రామంలో పర్యటించి కార్యకర్తల, ప్రజల ప్రజా సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానన్నారు. నియోజకవర్గంలోని నాయకులకు, కార్యకర్తలకు ఎక్కువ సంఖ్యలో పార్టీ పదవులు, నామినేటెడ్ పదవులు ఇవ్వాలనే అంశాలపై తీర్మానాలను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుమార్ రాజా రెడ్డి, రమేష్ రెడ్డి, కేశవుల నాయుడు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

విజేతల అభినందన కార్యక్రమంలో పతకాలు చూపుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని మధురి సాత్విక "ఆల్ ఇండియా పెన్ కాక్ సిలాట్ "క్రీడలో జెఎన్‌టియుఏ యూనివర్సిటీ ఆతిథ్యంలో, బెంగళూరులో15ఏప్రిల్ 2025 తేదీన ఉమెన్ వెయిట్ క్యాటగిరిల 75–80 కెజి "టాండింగ్ "వ్యక్తిగత విభాగంలో అత్యున్నత ప్రదర్శన కనబరిచి, కాంస్య పథకం కైవసం చేసుకుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాత్విక ఇసిఇ విభాగంలో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని సాత్విక ఎంతో చురుగ్గా చదువులోనూ, క్రీడల్లోనూ ముందంజలో ఉండేదని తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ , అకడమిక్ డీన్ డాక్టర్ విశ్వక్సేనారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించేందుకు యాజమాన్యం సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విభాగ అధిపతి డాక్టర్ నీరజ, ఏవో కొండా రెడ్డి , స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేష్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రాఘవయ్య, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.

అకాల వర్షంతో పంటలకు నష్టం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లాలో ఆదివారం, సోమవారం కురిసిన గాలీవానతో మిరప, మామిడి రైతులకు అపార నష్టం చేకూరింది. సత్యవేడు నియోజకవర్గం, బుచ్చి నాయుడుకండ్రిగ మండలంలోనే 180 ఎకరాల్లో మామిడి నేలరాలగా, 12 ఎకరాల్లో మిరప పంట దెబ్బతినింది. ఈ అకాల వర్షాలతో మిరప పంటును ఎండపెట్టాలంటే ఇబ్బందింగా ఉందని మండల రైతుల ఆవేదన వ్యక్తం చేశారు. పండిన పంట చేతికొచ్చే సమయంలో ఈ వర్షాలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అరకొర పంట మార్కెట్‌కు పంపినా గిట్టుబాటు ధర రాదని నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నేల రాలిన మామిడి కాయలు

తడిచిపోయిన ఆరబోసిన మిర్చి

చేనేత క్లస్టర్ ఏర్పాటు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి జిల్లా చేనేత అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా చేనేత అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కల్లివెట్టు, తలారివెట్టు గ్రామాలలో చేనేత కార్మికులు కుటుంబాలను సందర్శించారు. అనంతరం ఆయన చేనేత కార్మికులు, మహిళా సంఘాల సభ్యులతో గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో బుచ్చినాయుడు కండ్రిగ, డక్కిలి, చిన్నగొట్టిగల్లు మండలాలలో చేనేత క్లస్టర్‌లు ఏర్పాటు చేసుకొనుటకు ఏర్పాటు చేసుకొనుటకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇందులో మహిళ సంఘాల్లో ఉన్న చేనేత కార్మికులకు చేనేత పరికరాలు సబ్సిడీలో ఇవ్వనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత ఎఆర్‌ఓ కిరణ్మయి, వెలుగు ఏపియం. మునెయ్య, సిసి వెంకటరత్నం, వివోఎలు మునిశేఖర్, సుభాషిణి, గ్రామస్థులు పాల్గొన్నారు.

టిడిపి రూరల్ మండల కమిటీ ఏకగ్రీవ ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మండల నాయకులు మంగళవారం నగిరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, తడుకు సర్పంచ్ వెంకటేష్ బొబ్బిలి యాదవ్, కరుణ యాదవ్, మాజీ హాస్పిటల్ కమిటీ చైర్మన్ ఎస్.మోహన్ రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ : మండలంలోని రామానుజ పల్లి పంచాయతీ అంగనవాడి కేంద్రంలో స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంగన్వాడి సూపర్వైజర్ మంజుల విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి చదువు విషయంలో శ్రద్ధ కలిగి ఉండాలని అన్నారు. అలాగే పోషకాహారం తీసుకోవడంలో, ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మహిళ సంరక్షణ కార్యదర్శి గీత మాధురి మాట్లాడుతూ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాల వంటి వాటి గురించి కిశోర బాలికలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ రామచంద్రయ్య, అంగన్వాడి కార్యకర్త శారద, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మద్యం మాఫియాపై ఫిర్యాదు

ఫిర్యాదు చేస్తున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతిలో జరుగుతున్న మద్యం మాఫియా ఆగడాలపై వైసిపి నాయకులు ఎక్సైజ్ అధికారులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతిలో మద్యం మాఫియా ఆగడాలు రోజురోజు మితిమీరిపోతున్నాయని, అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని, 24 గంటలూ మద్యం విక్రయాలు జరుపుతున్నారని విమర్శించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు సైతం అధికారులకు అందజేసి, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని, భవిష్యత్తులో పునర్వృతం కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ వంశీ, జిల్లా సోషల్ మీడియా విభాగం ఉపాధ్యక్షులు ఇరగం అనిల్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే పాశిం సునిల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడు దఫాలుగా మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు కల్పించామని ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని డీ.ఆర్.డబ్ల్యూ కళాశాలలో ఎపి స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అద్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన పాల్గొని, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేశారు. ఎపి స్టేట్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ అద్వర్యంలో డీ.ఆర్.డబ్ల్యూ , లక్ష్య ఫౌండేషన్ సహకారంతో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఈ జాబ్ మేళాకు 22 వరకు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఐదు వందల మంది వరకు నిరుద్యోగులు హాజరై సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, లక్ష్య పౌండేషన్ నిర్వాహకులు భాను చంద్రా రెడ్డి, స్కిల్ డెవలప్ మెంట్ అధికారి లోక్ నాథం, ప్రిన్సిపాల్ హనుమంత రావు, విద్యాసాగర్, నాయకులు రహీమ్, సోమిశెట్టి చెంచు రామయ్య, మునిగిరీష్, గుండాల లీలావతి పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం.. ఇద్దరు ముద్దాయిలు అరెస్ట్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అటవీ క్షేత్ర అధికారిణి మాధవికి అందిన సమాచారం మేరకు కేవీబీ పురం మండలం మైల చెరువు సమీపంలో ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు అక్రమ రవాణా చేయుచున్నారని పిచ్చాటూరు, సదాశివకోన బేస్ క్యాంపు సిబ్బందిని అప్రమత్తం చేశారు. సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు రవాణా చేయుటకు ప్రయత్నిస్తుండగా సిబ్బంది పట్టుకున్నారు. పట్టుబడిన ముద్దాయిలు, శ్రీనివాసపురం గ్రామానికి చెందిన చిన్నప్ప, కెవిబి పురం మండలం, కండ్రిగకు చెందిన తిరుపాల్ అని తెలిపారు. పట్టుబడిన 15 ఎర్రచందనం దుంగల బరువు 107.4 కెజి లని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.67,000లు అని తెలిపారు. ఈ దాడిలో అటవీ ఆర్ వి రవి ప్రకాష్, కె లోకనాథం, ఎం సురేష్ కుమార్, నీలకంఠ వాసు, సదాశివ కోన బేస్ క్యాంప్ వాచర్సు. సి బి ఈ టి ప్రోడక్ట్ వాచెస్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులు పెంచాలి

నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం ఏపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ తదితరులు

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవీబీపురం మండలంలోని గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు కేవీబి పురం మండలం, కొత్తూరులో ఉపాధి కూలీలతో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఉపాధి పథకానికి నిధులు తగ్గిస్తూ పని దినాలు కల్పించడం లేదని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం బడ్జెట్లో నిధులు పెంచి సంవత్సరానికి 200 రోజులు పని కల్పించి, రోజుకు 600 రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వర లక్ష్మి, ఉపాధి హామీ పథకం వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి రైతు సంఘం వినతి పత్రం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు రైతుల, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఏఓ జోగి శివకుమార్‌కు మంగళవారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచి పోతున్నా రైతుల, కౌలు రైతులు సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని, రైతుకు రుణమాఫీ ఇవ్వాలని, ప్రతి రైతుకు, కౌలు రైతుకు 20 వేల రూపాయలు వెంటనే మంజూరు చేయాలని, విత్తనాలు, పురుగుమందులు, పనిముట్లు సకాలంలో ఉచితంగా అందజేయాలని కోరారు. ప్రతి రైతుకు ప్రభుత్వమే బీమా కల్పించాలని, 45 సంవత్సరాలు నిండిన రైతులకు పెన్షన్ మంజూరు చేయాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, గూడూరు సి.ఐ.టి.యు నాయకులు బి.వి.రమణయ్య, పుట్టా శంకరయ్య, ఏ.చంద్ర మోహన్, బి.చంద్రయ్య, గుర్రం రమణయ్య, రైతులు పాల్గొన్నారు.

సంఘాల ద్వారానే సాధికారత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మహిళా సంఘాల ద్వారానే ఆర్థిక సాధికారిత అని పుత్తూరు కెనరా బ్యాంక్ మేనేజర్ నరసింహులు పేర్కొన్నారు. రాష్ట్రీయ సేవా సమితి రాస్ సంస్థ మహిళ పొదుపు సంఘా సభ్యుల సౌకర్యార్థం క్లాప్ ప్రాంతీయ కార్యాలయంలో మంగళవారం టైలరింగ్ శిక్షణ ముగింపు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వేచ్చేసిన కెనరా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ చేతి వృత్తుల శిక్షణ ద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందన్నారు. ఒక గృహిణి చైతన్యవంతురాలైతే ఆ కుటుంబం అన్ని రంగాల్లో ముందుంటుందని తెలిపారు. అనంతరం టైలరింగ్ లో శిక్షణ పొందిన వారికి ఉచితంగా 15000 విలువచేసే కుట్టు మిషన్లు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాస్ అధికారులు రవి, జయంతి, ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు రైతుకు ఎంతో ఉపయోగకరం

వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కో-ఆర్టినేటర్ మెరుగు భాస్కరయ్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సాగు భూములలో మట్టిని పరీక్షలు చేసుకోవడం ద్వారా భూమి ఆరోగ్యం, భూసార స్థితిని తెలుసుకోవచ్చని వ్యవసాయ జిల్లా వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కో-ఆర్టినేటర్ మెరుగు భాస్కరయ్య పేర్కొన్నారు. భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వేసుకొంటే రైతుకు మంచి పంట దిగుబడులు వస్తాయని తెలిపారు. సాగు భూములలో మట్టి నమూనాలు సేకరించి, భూసార పరీక్షలు చేయించి, ఫలితాలను రైతులకు వ్యవసాయ శాఖ అంది స్తోందని తెలిపారు. ఈ ఫలితాలను సరియైన రీతిలో అర్థం చేసుకొని ఎరువులు యాజమాన్యం చేస్తేనే ఈ పరీక్షలకు అర్థం ఉంటుందన్నారు. కేవలం భూసార పరీక్షలు చేయించినంత మాత్రాన రైతులకు ఏమి వరగదనే విషయాన్ని రైతులు గుర్తించాలని కోరారు. పంట మొక్కలకు భూమిలోని పోషకాల అందుబాటు ఆ భూమి యొక్క స్వభావము, ఉదజని, సూచిక, భూమిలోని ఇతర పోషకాల నిల్వలపై ఆధారపడి ఉంటుందన్నారు. కాబట్టి వ్యవసాయ అధకారులు క్రింది పేర్కొన్న విషాయలను పరిగణలోనికి తీసుకొని రైతులకు ఎరువుల యాజమాన్యంలో సలహాలు ఇస్తుంటారని తెలిపారు. ఇసుక వరుస కలిగిన తేలిక భూముల్లో నత్రజని, పొటాష్ పోషకాలు సులభంగా నీటిలో కరిగి, భూమి లోపలి పొరల్లోకి వృధాగా పోతుంటుందన్నారు. తేలిక భూమిల్లో నత్రజని, పొటాష్, జింకు, బోరాన్ వంటి పోషకాల లోపాలు ఎక్కువగా కన్పిస్తాయని, కాబట్టి తేలిక భూముల్లో ఈ పోషకాల యాజమాన్యంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బంక వరుస కలిగి బరువు నేలల్లో భాస్వరం పోషకం స్థిరికరించబడి మొక్కలకు అందుబాటు తగ్గిపోతుందని తెలిపారు. కాబట్టి బరువు నేలల్లో అధికంగా భాస్వరం ఎరువులను వినియోగించాల్సి ఉంటుందన్నారు. డ్రిప్ ద్వారా ఈ మధ్య రైతులు నీటిలో కరిగే ఎరువులను అధికంగా వాడుతున్నారని, ఈ ఎరువులన్నీ ఆమ్ల గుణం కలిగినవి కాబట్టి భూముల్లో ఉదజని సూచిక తగ్గిపోతుందని హెచ్చరించారు. ఈ సమస్య రాకుండా రైతులు అధికారుల సిఫారసు మేరకే డ్రిప్‌లలో నీటిలో కరిగే ఎరువులను వాడాలని సూచించారు. నేల ఉదజని సూచిక పెరుగుతున్న కొద్ది, మొక్కలకు భాస్వరం, జింకు, ఇనుము, బొరాను పోషకాల అందుబాటు తగ్గుతుందని, కాబట్టి చౌడు వరస భూములలో ఈ పోషకాలను, నానో ఎరువుల రూపంలో,చీలేటెడ్ ఎరువుల రూపంలో పంటపై స్ప్రే చేయడం మంచిదని తెలిపారు. సేంద్రియ పదార్థం అధికంగా కలిగిన భూముల్లో గాలి ప్రసరణ, మురుగు నీటి పారుదల, సూక్ష్మ జీవుల చర్యలు బాగుండి మొక్కలకు అన్ని

పోషకాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పొలాలలకు పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు విరివిగా వాడకంతో భూమికి సేంద్రియ పదార్థ అధికంగా లభిస్తుందని తెలిపారు. ఈ మధ్య కాలంలో రైతులు దుక్కిలో వేయుటకు మాత్రమే సిపార్సు చేసే కాంప్లెక్ ఎరువులను, పంటలకు పైపాటుగా కూడా విరివిగా వాడుతున్నారని, దీని వలన భూములలో భాస్వరం అధికంగా ఉంటుందన్నారు. భూమిలోని భాస్వరాన్ని మొక్కలు 25-30 శాతం మాత్రమే వినియోగించుకొంటాయని, మిగతా మొక్కలకు అందని రూపంలో భూమిలో స్థిరీకరించబడిపోతుందని తెలిపారు. భాస్వరం అధికంగా గల భూముల్లో, భాస్వరం మొక్కలకు సులభంగా అందేందుకు సహాయపడే పాస్ఫో బ్యాక్టీరియా (పి.యస్.బి.) జీవన ఎరువును, ఎకరాకు 2 కిలోలు సేంద్రియ ఎరువుతో కలిపి వాడాలని సూచించారు. దీనివలన భూమిలో ఎక్కువగా ఉన్న భాస్వరం మొక్కలకు కొంత వరకైనా అందుబాటులోనికి వస్తుందన్నారు. భాస్వరం అధికంగా ఉన్న భూముల్లో మొక్కలకు జింకు ఇనుము అందుబాటు తక్కువగా ఉంటుంది కాబట్టి, ఇలాంటి భూముల్లో జింకు, ఇనుము లోప నివారణ చీలేటెడ్ రూపంలో సూక్ష్మ పోషకాలను పంటపై స్ప్రే చేస్తే మంచి ఫలితం ఉంటాయాన్నారు. సున్నం (కాల్షియం) లేదా మెగ్నీషియం అధికంగా ఉన్న భూముల్లో పొటాషియం పోషకం అందుబాటు తక్కువగా ఉంటుంది. సేంద్రియ ఎరువులు విరివిగా వాడి ఇలాంటి భూములను కొంత వరకు బాగు చేసుకోవచ్చని సూచించారు. లవణం సూచిక అధికంగా గల భూముల్లో (పాలచౌడు) భాస్వరం, జింకు, ఇనుము పోషకాల లోపాలు ఎక్కువగా కన్పిస్తాయని, ఇలాంటి భూములకు మంచి నాణ్యత గల నీరు పెట్టి, బాగా దున్ని, నీటిని బయటకు పంపి, సిపారసుల మేరకు ఎరువులు వాడాలన్నారు. ఈ రకంగా, నేల గుణగణాలు, భూమి ఆరోగ్యం పైనే కాకుండా, మొక్కల ఆరోగ్యంగా పెరగడానికి అవసరమైన వివిధ పోషకాల అందుబాటు పైన కూడా త్రీవ ప్రభావం చూపుతాంయని, కాబట్టి, భూసార పరీక్షా ఫలితాలలోని ప్రతి అంశాలన్ని క్షుణ్ణంగా పరిశీలించి రైతులు సాగులో సక్రమంగా ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ఈ విషయంలో వ్యవసాయ లేదా ఉధ్యాన అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు చేదోడు వాదోడుగా ఉండాల్సిన అవసరముందన్నారు. రైతులు, భూసార, పరీక్షా ఫలితాల కార్డును సంబంధిత అధికారులకు చూపి వారి సలహా మేరకు ఎరువులు వాడి పంటలు మంచి దిగుబడులు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను విజయవంతం చేయండి

పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నాయుడుపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు జూన్ 5వ తేదీ విజయవాడలో జరుగునున్న 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలను విజయవంతం చేయాలని నాయుడుపేట తాలూకా యూనిట్ అధ్యక్షులు బి.సాయిరాం కిషోర్ కోరారు. మంగళవారం నాయుడుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ మహాసభల గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలో రాష్ట్ర ఉద్యోగుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలియజేశారు. అధిక సంఖ్యలో ఉద్యోగులు విజయవాడకు తరలి వెళ్లేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మమత, స్వర్ణలత, సెక్రటరీ రమేష్, జాయింట్ సెక్రెటరీ ఈశ్వరమ్మ, లలిత, జాన్, శిరీష, ట్రెజరర్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైఖానస ఆగమ సలహా కమిటీ నియామకం

ప్రజాశక్తి - తిరుమల: గత మార్చి నెలలో జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు టీటీడీ ప్రస్తుత వైఖానస ఆగమ సలహా కమిటీని రద్దుచేసి, కొత్త కమిటీని నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కొత్త వైఖానస ఆగమ సలహా కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు ఎ.ఎస్.శ్రీ కృష్ణ శేషాచలం దీక్షితులు, ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలోని వైఖానస ఆగమ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పరాశరం భవనారాయణాచార్యులు, చెన్నైకు చెందిన పీ.కే.వరదన్ భట్టాచార్యార్, శ్రీ గోవిందరాజ స్వామి దేవాలయంలోని సంభావన అర్చకులు ఏ.అనంతశయన దీక్షితులు, మాజీ అర్చకులు ఏ.ఖద్రీ నరసింహాచార్యులను నూతన ఆగమ సలహా కమిటీలో సభ్యులుగా నియమించడం జరిగింది. వీరి పదవీకాలం రెండేళ్ల పాటు కొనసాగనుంది.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

వాహనదారులకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ నాగార్జున రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, తమ వాహనాల రికార్డులను వెంట ఉంచుకొని ప్రయాణించాలని అలిపిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగార్జున రెడ్డి సూచించారు. మంగళవారం తిరుపతి రేణిగుంట మార్గంలోని పార్క్ హోటల్ వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రికార్డు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని, జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో అలిపిరి ఎస్ఐ అజిత పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్వీ గోశాలకు ఎయిర్ కూలర్స్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఎస్వీ గోశాలను, అగర్ బత్తి ఫ్యాక్టరీని తిరుమల తిరుపతి దేవస్థానములు బోర్డు మెంబెర్ రంగ శ్రీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గోశాలకు 10ఎయిర్ కూలర్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్, జనసేన నాయకులు హేమకుమార్, మనోజ్, సాయిదేవ్, లోకేష్ పాల్గొన్నారు.

తుడా ఆస్తులు, ఆదాయ వివరాలపై

ప్రభుత్వం శ్వేత పత్రం ప్రకటించాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటి : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)కు చెందిన ఆస్తులు, ఆదాయ వివరాలపై శ్వేతపత్రం ప్రకటించాలని సిపిఎం నేత వందవాసి నాగరాజు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వివాదాలకు కేంద్రంగా మారుతున్న తుడా పరిపాలనలో పారదర్శకతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, సామాన్య, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చుకోవడానికి, పట్టణ విస్తరణకు తుడ కేంద్రంగా వ్యవహరించాల్సిన తరుణంలో అనేక వివాదాలకు నిలయంగా మారిందని గుర్తు చేశారు. ఇప్పటివరకు తుడా చేతిలో ఉన్న ఆస్తులు వాటి వివరాలు, ఆదాయం కేటాయింపులు గురించిన స్పష్టతను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నాగరాజు అన్నారు. తిరుపతి అభివృద్ధితో పాటు, తుడా విస్తరణ జరిగిందని, ఆ మేరకు అభివృద్ధి ఫలాలను ప్రజలకు పంచడంలో బాధ్యత గా వ్యవహరించలేదని ఆరోపించారు. తుడా అంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ప్లాట్లు అమ్మేవారికి, కొనేవారికి అనుమతులు ఇచ్చే సంస్థ కాదని, దానికి నిర్దిష్ట లక్ష్యాలు, కార్యాచరణ ఉన్నాయని దురదృష్టవశాత్తు ఆ పనులపై కేంద్రీకరణ ఉండటం లేదని అన్నారు. పట్టణాభివృద్ధి సంస్థలకు రావలసిన ఆదాయాలను రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరాలు కనుగుణంగా మళ్లింపులు చేస్తున్నాయని, దీనిని ఆపు చేసి తుడా పరిధిలోని అన్ని రకాల నిర్మాణాలనుంచి ఆదాయం నేరుగా తుడాకు అందేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. అనేక వెంచర్ల లో తుడా కొరకు కమ్యూనిటీ అవసరాల కోసం విడిచిపెట్టిన స్థలాలు, పార్కులు నిర్వహణ లేమితో నిర్లక్ష్యంగా పడి ఉన్నాయని ఆరోపించారు. తుడాలో నెలకొని ఉన్న తాజా పరిస్థితులపై ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి తాజా పరిస్థితులను వివరించాలని నాగరాజు డిమాండ్ చేశారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : ముఖ్యమంత్రి కుప్పం పర్యటనను జయప్రదం చేయాలని తిరుపతి గంగమాంబ దేవాలయ కమిటీ అధ్యక్షులు రవిచంద్రబాబు కోరారు. మంగళవారం ఆయన ఆలయ ప్రాంగణంలో పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం పట్టణంలో కలిసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర అంగరంగ వైభవంగా జరుగుతోందని, ఇందులో భాగంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించు కోవ డానికి ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో చేస్తారని తెలిపారు. సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మవారిని దర్శించుకునే ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యమంత్రి హోదాలో కుప్పం ఎమ్మెల్యే చంద్రబాబు అమ్మవారి దర్శనార్థం రానున్నట్టు తెలిపారు. అయితే సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా మధ్యాహ్న సమయంలో ముఖ్యమంత్రి అమ్మవారిని దర్శించుకోనున్నారని తెలిపారు. సుమారు 15 గంటల సమయం పాటు అమ్మవారి దర్శన భాగ్యం ఉంటుందని, అందులో కేవలం ఒక గంట సమయం మాత్రం వీఐపీలకు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ముఖ్యమంత్రి అమ్మవారి దర్శనార్థం వస్తున్న వేళ అమ్మవారి భక్తులు సమన్వయం పాటిస్తూ, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

జనసేన మరింత బలపడాలి : ఆరణి

జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లను పంపిణీ చేస్తున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్‌లను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పంపిణి చేశారు. మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన జనసేన సభ్యత్వ కిట్స్ పంపిణీలో మొదటి పది స్థానాల్లో నిలిచిన వారిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సన్మానించి కిట్స్ అందించారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ప్రెసిడెంట్ టీమ్ సభ్యుల సమక్షంలో కిట్స్ పంపిణీ జరిగింది. 1048 మంది సభ్యత్వాలు చేర్పించి ఆరణి మదన్ మొదటి స్థానంలో నిలువగా 1011 మందితో దినేష్ జైన్, 770 మందిని చేర్పించి మాజీ తహసీల్దార్ నరసింహులు నాయుడు మూడో స్థానంలో నిలిచారు. కాగా రాయలసీమలో అత్యధిక మెజారిటీ తిరుపతి వాసులు తనను గెలిపిస్తే జనసేన క్రియాశీలక వాలంటీర్లు సభ్యత్వ నమోదులో తిరుపతిని మొదటి స్థానంలో నిలిపారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. 2023లో నాలుగు వేల క్రియాశీలక సభ్యత్వం ఉంటే 2024లో పదహారు వేల 146 మందికి చేరిందని ఆయన చెప్పారు. వచ్చే ఏడాది కూడా జనసేన సభ్యత్వ నమోదులో తిరుపతిని మొదటి స్థానంలో నిలిపేందుకు క్రియా శీలక వాలంటీర్లు పని చేయాలని కోరారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందితే ఐదు లక్షల రూపాయలు, గాయపడితే 50 వేల రూపాయలు బాధిత కుటుంబానికి అందుతుందని ఆయన తెలిపారు. పవన్ కళ్యాణ్ ముందు చూపుతో కార్యకర్తల సంక్షేమం కోసం భీమా సౌకర్యం సభ్యత్వ నమోదుతో ముడిపెట్టారని ఆయన చెప్పారు. సభ్యత్వ నమోదుకు ఒక కార్యకర్త ఐదు వందల రూపాయల కడితే మిగిలిన పదిహేనువందల రూపాయలు పవన్ కళ్యాణ్ కడుతున్నారని తెలిపారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నాటికి అన్ని డివిజన్లలో జనసేన బలపడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూరంలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అమరులైన భారత సైనికులకు రెండు నిమషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, కీర్తన, ఆకుల వనజ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై మక్కువ పెరగాలి

ప్రజాశక్తి -గంగవరం: తెలుగు భాషపై తల్లిదండ్రులు మక్కువ పెంచుకోవాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి తులసినాథం నాయుడు కోరారు. మంగళవారం కళామందిరంలో ఉచిత వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తులసినాథం నాయుడు మాట్లా డుతూ తల్లిదండ్రులు ఆంగ్లభాషపై మోజుతో పిల్లలకు తెలుగు చదవడం, రాయడం రాకపోయినా పట్టించు కోవడం లేదన్నారు. అందుకే వేసవి శిక్షణా శిబిరంలో తెలుగు చదవడం, రాయడం నేర్పించడంతో పాటు రోజుకు ఒక నీతి పద్యం, కథ నేర్పించామన్నారు. సంస్థ కార్యదర్శి పుష్ప మాట్లాడుతూ తెలుగు భాషతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పడానికి ఈ 20 రోజులు కృషి చేశామన్నారు. ప్రముఖ రచయితలు మాధవ రెడ్డి, చంద్రశేఖ రయ్య మాట్లా డుతూ సెలవుల్లో తమ సమ యా న్నంతా వెచ్చించి ఉచితం గా పిల్లలకు తెలుగు భాష నేర్పడమే కాక ప్రతిరోజూ వారికి చిరుతిండి అందించడం అభినందనీ యమన్నారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు పద్యాలు నేర్చుకొని పాడుతుంటే చాలా ఆనందంగా ఉందన్నారు. ఇంట్లో కూడా రోజుకు ఒక పద్యం నేర్చుకునేలా ప్రోత్సహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఈ శిక్షణలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, పుస్తకాలు, గోల్డ్ మెడల్స్ బహుమతులుగా అందించారు. ఈ కార్యక్రమంలో దేవేంద్ర, నవ్య పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు, బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

సమిష్టి కృషి ఫలితంగానే అధికారం

- 'మహానాడు'లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ - 25 తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నాయకులు, యువత, మహిళలు, కూటమి పార్టీల సమిష్టి కృషి ఫలితంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని.. కలిసికట్టుగా ప్రతి ఒక్కరూ కష్టపడడం వల్లే చిత్తూరులోనూ విజయం సాధించామని.. ఇది సమిష్టి విజయం అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో చిత్తూరు నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులు అర్పించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ చెప్పిన పని ప్రతిఒక్కటి ఫలితం ఆశించకుండా చేయడం వల్లే విజయం సాధించామని.. 2014 నుంచి టిడిపి, సీఎం , లోకేష్ అప్పగించిన ప్రతి బాధ్యతను చిత్తశుద్ధితో పూర్తి చేశానన్నారు. కలిసి వచ్చే అందర్నీ కలుపుకొని వెళ్లాలని ఉద్దేశంతోనే.. చిత్తూరులోని మాజీ ఎమ్మెల్యే అందరినీ కలిసి మద్దతు అడిగానని.. ప్రతి ఒక్కరూ తమ మద్దతు తెలియజేసి ఎన్నికల్లో విజయానికి కృషి చేశారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన దృష్ట్యా నామినేటెడ్ పదవులు, ఇతర పదవుల్లో సర్దుబాటు అవసరమైన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పదవులు రాలేదని బాధపడద్దని.. ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేస్తామని.. నష్టపోయిన నాయకులు, కార్యకర్తలకు ఆర్థిక భరోసా ఇచ్చే కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు. చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని, రాబోయే రోజుల్లో పారిశ్రామికంగా మరిన్ని

అభివృద్ధి పనులు చేపట్టి స్థానిక యువతకు చిత్తూరులోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే చిత్తూరు నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారులు, ఎక్స్ ప్రెస్ హైవేల పనులు వేగంగా జరుగుతున్నాయని, బుల్లెట్ ట్రైన్ వస్తుందన్నారు. స్థానిక ప్రజల అవసరాలు, కార్యకర్తల అభిప్రాయాల మేరకు రూపొందించిన తీర్మానాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటికి అవసరమైన నిధుల మంజూరు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్సీ రాజసిం హులు, చుడా ఛైర్ పర్సన్ కటారి హేమలత, పరిశీలకులు మారుతీ చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు మహానాడు ను ఉద్దేశించి మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులను ఘనంగా సత్కరించారు. చిత్తూరు నగరపాలక పరిధిలోని డివిజన్ల వారిగా కమిటీల ఎన్నికలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీకే బాబు, ఏఎస్ మనోహర్, గాంధీ, పరిశీలకులు సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్, అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, నాయకులు వసంత్ కుమార్, త్యాగరాజన్, మోహన్ రాజ్, పీటర్, రాజేశ్వరి, సుబ్బా నాయుడు, శశికర్ బాబు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

మాజీ మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి- విజయపురం (నగరి): పార్టీ శ్రేణులకు జగనన్న ఇచ్చిన పదవులు పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడానికి, ప్రజలకు అండగా నిలబడటానికి ఇచ్చిన బాధ్యతని మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శిగా నియమితులైన గోవర్ధనం నాయుడుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం మాజీ మంత్రిని ఆమె స్వగృహంలో కలిసి గజమాల, దుస్సాలువలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పదవులతో పార్టీ పటిష్టతకు పాటుపడాలన్నారు. పాలక ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజా సమస్యలపట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ వారికి అండగా నిలబడాలన్నారు. ఈ సందర్భంగా గోవర్ధన నాయుడు మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదవిని బాధ్యతతో నెరవేరుస్తానన్నారు. పార్టీ మండల అధ్యక్షులు శివరాజు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జూ. ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జూనియర్ ఎన్టీఆర్ 42వ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం స్థానిక పిసిఆర్ సర్కిల్ వద్ద అభిమానులు నిర్వహించిన కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఏఎస్ మనోహర్ భారీ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు శ్రీధర్ నాయుడు, ఉపాధ్యక్షులు భాను ప్రకాష్, అసోసియేషన్ నాయకులు సుధీర్, మైను, సంపత్, కిరణ్, మహేష్ చౌదరి, వినయ్ పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం పంచాయతీలోని పిళ్లారికుప్పం గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో గంగమ్మకు అభిషేకం పూజలు నిర్వహించి అంబళ్లు, పొంగళ్ల తో నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. సాయంత్రం అమ్మవారాకి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి,వార్డు మెంబర్ మురళి, పాలశేఖర్, దేవరాజులు, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ నాయుడు, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, జిల్లాఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, నియోజకవర్గ ముస్లిం మైనారిటీ ప్రధాన కార్యదర్శి నియాజ్ అలీ పాల్గొన్నారు.

జీడి నెల్లూరు డాక్టర్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా జి గురు ప్రకాష్ మంగళవారం బాధ్యతల స్వీక రించారు. ఈ సంద ర్భంగా గతంలో అస్సాం రాష్ట్రంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ లో చీఫ్ మెడికల్ డాక్టర్ గా సేవలందించారు. మండలంలో పోస్ట్ ఖాళీగా ఉండడంతో ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు డాక్టర్ గురు ప్రకాష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గురు ప్రకాష్ కు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, సిహెచ్ఓ శ్రీనివాసులు, ఆసుపత్రి సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

బ్యాంకు వద్ద పాము సంచారం

భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల సమీపంలోని యూనియన్ బ్యాంకు వద్ద మంగళవారం 11 గంటల ప్రాంతంలో బ్యాంకు ఎదురుగా నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాల వద్ద పాము సంచరించింది. దీన్ని చూసి బ్యాంకు ఖాతాదారులు భయాందోళనకు గురయ్యారు. బ్యాంకు వద్ద ఉన్న ఓ ద్విచక్ర వాహనంలో నుండి పాము బయటకు వచ్చిందని పలువురు తెలిపారు. కర్రతో పామును చంపి వేశారు. దీంతో ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

విలేకరులకు పాలకమండలి నిర్ణయాలను వెల్లడిస్తున్న ఈవో జె.శ్యామలరావు

స్విమ్స్‌లో 597 పోస్టుల భర్తీ

తిరుమల భద్రతకు యాంటీ డ్రోన్ టెక్నాలజీ
స్విమ్స్ అభివృద్ధికి అదనంగా రూ.71 కోట్ల నిధులు

డీడీ నెక్స్ట్ లెవల్ చిత్రబృందంపై చట్టపరమైన చర్యలు
టిటిడి ఈవో జె.శ్యామలరావు వెల్లడి

ప్రజాశక్తి -తిరుమల

స్విమ్స్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి టిటిడి పాలకమండలి నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తిరుమల అన్నమయ్య భవన్‌లో ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన జరిగిన పాలకమండలి నిర్ణయాలను ఈవో జె.శ్యామలరావు మీడియాకు వెల్లడించారు.

– రాయలసీమకే తలమానికంగా ఉంటూ ఎందరో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఆర్థిక సహాయంగా ఏడాదికి ఇప్పుడు అందిస్తున్న రూ.60కోట్లతో పాటు అదనంగా మరో రూ.71 కోట్లు అందించేందుకు ఆమోదం తెలిపింది. స్విమ్స్ మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందకు ప్రస్తుతం ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది నియామకం చేపట్టేందుకు నిర్ణయం. అదేవిధంగా 85శాతం నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవంతులను (ఆంకాలజీ మరియు పద్మావతి చిన్ని పిల్లల ఆసుపత్రిలతో కలిపి) త్వరలోనే మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా నిర్ణయం. శ్రీవారి వైద్య సేవను కూడా అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయం.

– తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలతీర్థం కపిలేశ్వరస్వామి ఆలయం, నాగాలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయాల అభివద్ధి కోసం సమగ్ర బహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్ ల నుండి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం.

– తిరుమలలోని విశ్రాంత భవనాల పేర్లు మార్పులో మిగిలిన ఇద్దరు దాతలు స్పందించలేదు. దీంతో ఈ విశ్రాంతి గృహాల పేర్లను టీటీడీనే మార్పు చేయాలని నిర్ణయం. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు విషయంలో వారితో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– తిరుమలలోని బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల లైసెన్సు ఫీజును నిర్ణయించే అంశంపై ఆమోదం. భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు పేరొందిన సంస్థలకు ఇవ్వాలని నిర్ణయం.

– ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాలను భక్తులు విశేష సంఖ్యలో సందర్శిస్తున్న నేపథ్యంలో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయం.

– తిరుమల ఆలయ భద్రతను దృష్టిలో పెట్టుకుని యాంటీ డ్రోన్ టెక్నాలజీ వాడాలని నిర్ణయం. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవాలని ఆధికారులకు ఆదేశం.

– శ్రీవారి నామావళిని రీమిక్స్ చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన డీడీ నెక్స్ట్ లెవల్ చిత్రబందంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయం.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి ప్రసూతి ఆసుపత్రిలో, శ్రీకాళహస్తి ప్రాంతాలలో గర్భవతి ప్రసవించిన తరువాత డిశ్చార్జ్ అయ్యి ఆసుపత్రి నుండి ఇంటికి సురక్షితంగా చేరవేస్తున్న తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ల సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయని, ఆ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు తిరుపతి నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, అరబిందో కంపెనీ ఈ కాంట్రాక్టు తీసుకుని వీరికి చాలీచాలని జీతాలను చెల్లిస్తోందన్నారు. నెలకు 7,850 రూపాయలు మాత్రమే వేతనాలుగా చెల్లిస్తున్నారని, ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఈ జీతం ఏ మూలకు సరిపోతుందని వారు వాపోయారు. అరబిందో కాంట్రాక్టు అయిపోతున్న సందర్భంలో, కొత్త కాంట్రాక్టర్ యథావిధిగా తమను కొనసాగించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు పి బుజ్జి, తంజావూరు మురళి, తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ డ్రైవర్ల యూనియన్ నాయకులు హరి, ప్రసాద్, నవీన్, విశ్వనాథరెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.